ముగ్గురు సీఐల బదిలీ

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముగ్గురు సీఐలను బదిలీచేస్తూ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వెస్ట్ సబ్‌డివిజన్ ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. ఇటీవల గిరి ప్రదక్షిణ సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో శ్రీనివాసరావు విఫలమయ్యారనే కారణంతోనే ఆయన్ను సరండర్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియా సెల్ సీఐగా పనిచేస్తున్న కె.సురేష్‌ను వెస్ట్ సబ్‌డివిజన్ ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో వున్న సీహెచ్ ఉమాకాంత్‌కు సోషల్ మీడియా సీఐగా పోస్టింగ్ ఇచ్చారు.

మరో పార్కుకు ఎసరు

ఫేకర్ లేఅవుట్‌లోని పార్కులో షెడ్డు నిర్మాణం, విద్యుత్ కనెక్షన్

- టీడీఆర్ కోసం కొందరి యత్నం
- విలువ రూ.90 కోట్లు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- ఆ పార్కు అభివృద్ధికి రెండేళ్ల క్రితం రూ.1.6 కోట్లు కేటాయించిన జీవీఎంసీ
- పనులు చేయకుండానే బిల్లుల చెల్లింపు


28వ వార్డులోని ఫేకర్ లేఅవుట్‌లో గల పార్కులో నిర్మించిన షెడ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ 28వ వార్డు పరిధిలో గల ఫేకర్ లేఅవుట్‌లోని పార్కును కొట్టేసేందుకు ప్రైవేటు వ్యక్తులు పావులు కదుపుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందులో భాగంగానే షెడ్డు నిర్మించి, విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రూ.1.60 కోట్లు వ్యయంతో నిర్మించినట్టు చెబుతున్న ప్రహరీ

జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఫేకర్ లేఅవుట్ ఉంది. దశాబ్దాల కిందట వాల్తేరు వార్డు టౌన్ సర్వే నంబర్ 76లో (ఎల్‌పీ నంబర్ 8/97) లేఅవుట్ వేశారు. లేఅవుట్‌లో సుమారు 4,500 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఆ పార్కు జీవీఎంసీ ఆధీనంలోనే ఉంది. అభివృద్ధి చేయాలంటూ ఫేకర్ లేఅవుట్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో రెండేళ్ల కిందట జీవీఎంసీ రూ.1.6 కోట్లు కేటాయించింది. ఆ పనులను టెండర్ల ద్వారా కేటాయించారు. ఇదిలావుండగా పార్కు స్థలం తమదంటూ కొందరు ప్రైవేటు వ్యక్తులు తప్పుడు పత్రాలను సృష్టించి కొట్టేయడానికి యత్నిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పార్కు లోపల షెడ్ నిర్మించడమే కాకుండా విద్యుత్ కనెక్షన్ కూడా ఏర్పాటుచేశారని, ఇదంతా ఎవరు చేశారని జీవీఎంసీ అధికారులను అడిగితే తమకు సంబంధం లేదని చెప్పడం తమకు ఆందోళన కలిగిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. జీవీఎంసీకి సంబంధం లేకుండా సొంతంగా షెడ్ నిర్మించిన వ్యక్తులే ఆ స్థలం తమదని పేర్కొంటూ టీడీఆర్ కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేసుకున్నట్టు ఆరోపిస్తున్నారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులను కలిసి ఆరా తీస్తే ఎవరైనా దరఖాస్తు చేసి ఉండవచ్చునని ఇంకా తమ దృష్టికి అయితే రాలేదని దాటవేత ధోరణిలో సమాధానం చెబుతున్నారన్నారు. అక్కడ భూమి ధర గజం రూ.రెండు లక్షలు వరకు ఉంది. అంటే 4,500 గజాలు రూ.90 కోట్లు విలువ ఉంటుంది. అంతటి విలువైన ఆస్తి పరిరక్షణ పట్ల జీవీఎంసీ ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 25వ వార్డులోని రాజేంద్రనగర్ పార్కు, ఈస్ట్‌పాయింట్ కాలనీ పార్కు, ఐదో వార్డులోని స్వతంత్రనగర్ పార్కు, బొట్టవానిపాలెం

... మిగతా 4వ పేజీలో

పైలా అవినాష్... రూ.11.5 లక్షలు

- రిక్కీ బుయ్ రూ.10.26 లక్షలు, గిరినాథ్‌రెడ్డి రూ.10.2 లక్షలు
- శ్రీకర్ భరత్, నితీష్‌కుమార్‌రెడ్డి, హనుమ విహారి, అశ్విన్ హెబ్బర్‌కు రూ.పదేసి లక్షలు
- రసవత్తరంగా ఏపీఎల్ సీజన్-4 ఆటగాళ్ల వేలం


పైలా అవినాష్

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీకి సంబంధించి సోమవారం నిర్వహించిన వేలంలో ఐకాన్ ఆటగాళ్లు మంచి ధర పలికారు. నగరానికి చెందిన పైలా అవినాష్ అత్యధికంగా రూ.11.5 లక్షలకు అమ్ముడుపోగా, తర్వాత స్థానంలో రికీ బుయ్ (రూ.10.26 లక్షలు) ఉన్నారు. ఇక టాప్ సీడ్ ఆటగాళ్లలో గిరినాథ్‌రెడ్డి రూ.10.2 లక్షలకు, టీమిండియా ఆటగాళ్లు నితీష్‌కుమార్‌రెడ్డి, శ్రీకర్ భరత్, హనుమ విహారితోపాటు ఇతర ఆటగాళ్లు తలో రూ.10 లక్షలకు అమ్ముడయ్యారు. నాలుగు కేటగిరీల నుంచి 520 మంది ఆటగాళ్లను వేలంలో ఉంచారు. జట్టు సభ్యుల కొనుగోలు కు రూ.45 లక్షలు కేటాయించేలా ఫ్రాంచైజర్‌కు పరిమితి విధించారు. టీమిండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారితో పాటు ఐపీఎల్ ఆడిన తొమ్మిది మంది ఆటగాళ్లను టాప్ సీడ్‌లో, గ్రేడ్-ఏలో

... మిగతా 4వ పేజీలో

పడకేసిన డయాలసిస్ యూనిట్లు

కేజీహెచ్ నెఫ్రాలజీ విభాగంలో 10 మెషీన్లు

ఐదు మెషీన్లు మూడు వారాలుగా పనిచేయని వైనం

- రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు
- గతంలో 20 నుంచి 30 మందికి డయాలసిస్
- ప్రస్తుతం పది, పదిహేను మందికే...
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన
- ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని డిమాండ్


మూలకు చేరిన డయాలసిస్ మెషీన్లు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ సేవలు అందించే మెషీన్లు మూలకు చేరాయి. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే రోగులకు డయాలసిస్ చేసేందుకు విభాగంలో పది మెషీన్లు ఉన్నాయి. వీటి సాయంతో ప్రతిరోజూ 20 నుంచి 30 మందికి డయాలసిస్ చేస్తుంటారు. రోగుల సంఖ్యను బట్టి, వారికి ఉన్న సమస్యను బట్టి వైద్యులు షెడ్యూల్ ఇస్తారు. రోగి పరిస్థితిని బట్టి నెలలో రెండు నుంచి మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఈ విభాగంలో మెషీన్లు పనిచేయకపోవడంతో సేవలు అందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని, అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కేజీహెచ్‌లో డయాలసిస్ సేవలు పొందుతున్నట్టు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో మరోచోట ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద డయాలసిస్ సేవలు పొందలేని పరిస్థితి ఏర్పడినట్టు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న మెషీన్లు సహాయంతో రోజుకు పది నుంచి 15 మందికి మాత్రమే సేవలు అందిస్తున్నట్టు తెలుస్తోంది.

మూడు వారాల నుంచి...

నెఫ్రాలజీ విభాగంలో ఉన్న పది మెషీన్లలో రెండు, మూడు సాంకేతిక సమస్యలతో పనిచేయవు. మిగిలిన ఏడు, ఎనిమిదింటితో రోగులకు సేవలు అందిస్తుంటారు. అయితే, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఒకేసారి ఐదు మెషీన్లు మూలకు చేరడంతో రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు

... మిగతా 4వ పేజీలో


పోర్టు అథారిటీ కంటైనర్ టెర్మినల్ వద్ద పలు ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న కేంద్ర పోర్టులు, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్. చిత్రంలో కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖ సహాయ మంత్రి శాంతన్ ఠాకూర్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పోర్టు చైర్మన్ అంగముత్తు ఉన్నారు.

పోర్టుల్లో డిజిటల్ ఆపరేషన్లు

- రవాణా వ్యయం తగ్గించడమే లక్ష్యం
- భవిష్యత్తులో భారీగా క్రూయిజ్ టూరిజం
- కేంద్ర పోర్టులు, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్
- విశాఖ పోర్టులో రూ.320 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జల రవాణాను అత్యంత తక్కువ ధరకు అందించడమే లక్ష్యంగా బిమ్స్ టెక్ సదస్సును ఏర్పాటు చేశామని కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖా మంత్రి శర్బానంద సోనోవాల్ చెప్పారు. సోమవారం ఉదయం నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఆయన...సాయంత్రం పోర్టులో రూ.320 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోర్టులన్నీ డిజిటల్ ఆపరేషన్ల మోడ్‌లోకి

... మిగతా 4వ పేజీలో

చెలరేగిపోతున్న భూ కబ్జాదారులు

నరవలో గెడ్డ పోరంబోకులో ఇళ్ల నిర్మాణం

రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు విక్రయం

- గవర జగ్గరాజుపాలెంలో ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠం భూములు అమ్మకం
- సత్తివానిపాలెంలో లక్ష్మీసాగర్ చెరువు ఆక్రమణకు యత్నం
- ఆక్రమణదారులకు రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలు


సత్తివానిపాలెంలో లక్ష్మీసాగర్ చెరువు ఆక్రమణకు లెవెలింగ్

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో భూ కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. చెరువులు, వాగులు, గెడ్డలు, కొండ పోరంబోకు భూములు, గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుంటున్నారు. అందుకు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు వారి బంధువులు అండగా నిలుస్తున్నారు.

- రెవెన్యూ, పంచాయతీ, జీవీఎంసీ అధికారుల మొద్దునిద్ర

పెందుర్తి మండలం చింతగట్ల గ్రామంలో కొండ పోరంబోకు భూమిని కొట్టేయడానికి చేస్తున్న ప్రయత్నాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే అటువంటి ఆక్రమణలు అనేకం

... మిగతా 4వ పేజీలో


గెడ్డవాగులో అక్రమ నిర్మాణం

కోడి వ్యర్థాల తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు

- నిబంధనలకు విరుద్ధంగా సేకరణ, చేపల చెరువులకు తరలింపుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో రౌడీషీటర్లు కూడా పాలుపంచుకుంటూ దౌర్జన్యాలు, ఘర్షణలకు దిగుతుండడంతో భవిష్యత్తులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉన్నందున పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మాఫియా వెనుక ఎవరెవరు ఉన్నారనేది బయటకు తీయడంతోపాటు చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ అనకాపల్లి, పీఎం పాలెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనకాపల్లిలో ఆ జోన్ శానిటరీ సూపర్‌వైజర్ రవి, పీఎం పాలెంలో జీవీఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ కిషోర్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ ప్రారంభిస్తే దీని వెనుక ఎవరెవరు ఉన్నదీ బయటకు వస్తుందని జీవీఎంసీ కార్పొరేటర్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (సొసైటీలు)కు ముగ్గురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మధురవాడ సొసైటీకి చైర్‌పర్సన్‌గా పోతిన ప్రసాద్, పర్సన్‌లుగా బైపల్లి పైడిరాజు, పోతిన వెంకటమీనాక్షి, మజ్జివలస సొసైటీకి చైర్‌పర్సన్‌గా గూడాల ఎల్లయ్య, పర్సన్‌లుగా కాగితాల రమణ, కాళ్ల సత్యనారాయణ, ఆనందపురం సొసైటీకి చైర్‌పర్సన్‌గా పాండ్రింగి అప్పలరాజు, పర్సన్లుగా ఎర్ర బంగారునాయుడు, మీసాల రామునాయుడు, శొంఠ్యాం సొసైటీకి చైర్‌పర్సన్‌గా గండ్రెడ్డి సోమునాయుడు, పర్సన్లుగా

... మిగతా 4వ పేజీలో

ఏయూలో అగ్రిమెంట్‌పై రచ్చ

కాంట్రాక్టు అధ్యాపకులతో అగ్రిమెంట్‌కు అధికారుల నిర్ణయం

- సంతకాలు చేయించే బాధ్యతను ప్రిన్సిపాల్స్‌కు అప్పగించిన వీసీ
- అందులోని నిబంధనలపై అధ్యాపకుల ఆగ్రహం
- సంతకం చేసేందుకు నిరాకరణ


ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఎంవీఆర్ రాజును కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకుల అగ్రిమెంట్ వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. వివిధ విభాగాల్లో 99 మంది

... మిగతా 4వ పేజీలో

అదృశ్యం కేసుల్లో మిస్టరీని త్వరలో ఛేదిస్తాం

» సీఐ తిరుమలరావు

భీమునిపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మిస్టరీగా మారిన ప్రసిద్ధ చోడేశ్వరాలయ అర్చకుడు ఏడిద గణేశ్ సుబ్రమణ్యశర్మ అదృశ్యం కేసును త్వరలోనే ఛేదిస్తామని భీమిలి సీఐ బి.తిరుమలరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి దర్శనానంతరం వెళ్లిన సుబ్రమణ్యశర్మ గత ఏప్రిల్ 26 నుంచి అదృశ్యమయ్యారన్నారు. ఈ కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా జి.హరీష్‌ను కొంత కాలం క్రితం నియమించారని, కాగా, ఆయన విశాఖ నగర టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారని తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో ఆసక్తికర విషయాలు తెలిశాయన్నారు. కొత్తగా మరో ఐవోను నియమిస్తామని, వీలైనంత తొందరలో మిస్టరీని ఛేదిస్తామన్నారు.

కాగా, ఈ నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'అదృశ్యం కేసుల్లో వీడని మిస్టరీలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కాపులుప్పాడ వీఆర్వో బడే శ్రీను అదృశ్యమైన కేసును కూడా మరోసారి స్టడీ చేస్తామని, ఆ కేసులో కూడా విచారణ చేస్తామన్నారు. ఈ రెండు కేసుల మిస్టరీని ఛేదించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతి లేని నిర్మాణాన్ని నిలిపివేయండి

» కార్పొరేటర్ మంగమ్మ వినతి



కార్పొరేటర్ మంగమ్మ ఇచ్చిన వినతిని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్

మధురవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7 వ వార్డు ఆర్టీసీ బస్ డిపో నుంచి వాంబేకాలనీకి వెళ్లే రహదారిలో అనుమతులకు భిన్నంగా 9వ అంతస్థు నిర్మిస్తున్న భవనం పనులు నిలుపుదల చేయించాలని ఆ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందించారు. అలాగే 7వ వార్డు పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆమె కోరారు. కార్పొరేటర్ వెంట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఉన్నారు.

సంక్షేమానికి శ్రీకారం చుట్టింది టీడీపీ

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» పాలవలస గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కూటమి నేతలు

ఆనందపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన తొలి రాజకీయ పార్టీ టీడీపీ అని భీమిలీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పాలవలస గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ పేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వైసీపీ ఓడిపోతే సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోతాయని తప్పుడు ప్రచారం చేశారని, అంతకంటే మెరుగ్గా కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. పింఛన్లు, తల్లికి వందనం వంటి పథకాలను గతం కంటే ఎక్కువ మంది లబ్ధిదారులకు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఎన్నికల్లో చెప్పినట్టు అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామని, మెగా డీఎస్సీ ప్రకటించామన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాత్రాజు అప్పారావు, బీఆర్బీ నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, నిమ్మల అప్పలరాజు, శేఖర్, కర్రి శ్రీనివాస్, పాండ్రంకి అప్పలరాజు, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లపై దశల వారీ పోరు : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

తగరపువలస, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు ఏర్పాటు చేయనున్న విద్యుత్తు స్మార్టు మీటర్లపై దశలవారీగా పోరాటం చేయాలని సోమవారం తగరపువలసలో జరిగిన సీపీఐ సమావేశం తీర్మానించింది. జీఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి సీపీఐ కార్యదర్శి కె.రాంబాబు అధ్యక్ష తన వహించారు. స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని, ప్రజా సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపడాన్ని సహించేది లేదన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక కార్యక్రమాల వల్లే జగన్ ప్రభుత్వం గద్దె దిగిపోయిందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు అప్పలరాజు, గోవిందరావు, సన్యాసిరావు, లక్ష్మణరావు అప్పారావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పైలా అవినాష్... రూ.11.5 లక్షలు

... 3వ పేజీ తరువాయి

21 మందిని, గ్రేడ్-'బి'లో 112 మందిని, గ్రేడ్-'సి'లో 378 ఆటగాళ్లను వేలంలో ఉంచారు. ఆల్‌రౌండర్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. రాయల్స్ ఆఫ్ రాయలసీమ, భీమవరం బుల్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్‌షైనర్స్, కాకినాడ కింగ్స్ అమరావతి రాయల్స్ జట్లకు చెందిన ఫ్రాంచైజర్లు వేలంలో పాల్గొన్నారు. వేలానికి ముందు టాప్ సీడ్‌లో ఉన్న తొమ్మిది మంది ఆటగాళ్లలో ఎనిమిది మందిని ఏడు జట్లు సొంతం (రిటైన్) చేసుకున్నాయి. రిటైన్ చేసుకున్న వారిలో హనుమ విహారి (రూ.10 లక్షలు, అమరావతి రాయల్స్), అశ్విన్ హెబ్బర్ (రూ.10 లక్షలు, విజయవాడ సన్‌షైనర్స్), రషీద్ (రూ.10 లక్షలు, తుంగభద్ర వారియర్స్), కేవీ శశికాంత్ (రూ.5 లక్షలు, తుంగభద్ర వారియర్స్), రికీ బుయ్ (రూ.10.26 లక్షలు, సింహాద్రి వైజాగ్ లయన్స్), శ్రీకర్ భరత్ (రూ.10 లక్షలు, కాకినాడ కింగ్స్), కె.నితీష్‌కుమార్‌రెడ్డి (రూ.10 లక్షలు, భీమవరం బుల్స్) ఉన్నారు.

పైలా అవినాష్...రూ.11.5 లక్షలు

గ్రేడ్-ఏలోని 21 మంది ఆటగాళ్లలో ఒకడైన నగర క్రికెటర్ పైలా అవినాష్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు ఫ్రాంచైజర్లు రూ.11.5 లక్షలకు కొనుగోలు చేశారు. ఏపీఎల్ సీజన్-4లో అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా అవినాష్ రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత స్థానంలో ఉన్న రిక్కీ బుయ్ (రూ.10.26 లక్షలు)తో పాటు రూ.10 లక్షలకు రిటైన్ చేసుకున్న నితీష్ కుమార్‌రెడ్డి, శ్రీకర్ భరత్ కూడా విశాఖకు చెందినవారు కావడం గమనించదగ్గ విషయం.

ఏయూలో అగ్రిమెంట్‌పై రచ్చ

... 3వ పేజీ తరువాయి

కాంట్రాక్టు అధ్యాపకులు గడిచిన కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. అయితే, ఉన్నత స్థాయి ఆదేశాలతో వర్సిటీ అధికారులు అగ్రిమెంట్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారు. కాంట్రాక్టు అధ్యాపకులతో అగ్రిమెంట్ చేయించుకోవాలంటూ వైస్ చాన్సలర్ నుంచి కాలేజీ ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు అందాయి. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్స్ అగ్రిమెంట్ పత్రాలపై సంతకాలు చేయించుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే అందులోని నిబంధనలను వ్యతిరేకిస్తూ సంతకాలు పెట్టేందుకు కాంట్రాక్టు అధ్యాపకులు ముందుకురావడం లేదు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకాలు చేయబోమని కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతుంటే, అగ్రిమెంట్‌పై సంతకాలు చేయించే బాధ్యత ప్రిన్సిపాల్స్‌దేనని వైస్ చాన్సలర్ స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు జఠిలంగా మారింది.

ఇదీ సమస్య?

వర్సిటీలో పది, పదిహేనేళ్లుగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. అయితే, వారితో ఒప్పందాలు చేసుకోవాలంటూ ఉన్నత స్థాయి నుంచి వర్సిటీ అధికారులకు ఆదేశాలు అందినట్టు చెబుతున్నారు. ఆ మేరకు పత్రాలను అధికారులు సిద్ధం చేశారు. అయితే, అందులో ఉన్న నిబంధనలు తమకు అన్యాయం చేసేలా ఉన్నాయంటూ కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతున్నారు. 'వర్క్ లేకపోతే తొలగింపు', 'ఎట్టి పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించకూడదు', 'రాజకీయ నాయకులను కలవకూడదు', 'ఎప్పుడైనా తొలగించే అధికారం'...వంటి అంశాలు ఉన్నాయి. అవన్నీ తమ హక్కులను హరించేలా ఉన్నాయంటూ కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు అధ్యాపకులంతా సోమవారం ఆయా ప్రిన్సిపాల్స్‌ను కలిసి తాము సంతకాలు చేయబోమని స్పష్టంచేశారు. దీనిపై ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయాన్ని బట్టి న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధపడుతున్నట్టు తెలిసింది.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

భీమునిపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు అదే పాఠశాల పూర్వ విద్యార్థి ఐఆర్‌ఎస్ అధికారి వీఎం మహిధర్ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు మొత్తం 9 మందికి వరుసగా రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు చొప్పున మొత్తం రూ. 30 వేలు అందజేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

» జేసీకి చింతగట్ల గ్రామస్థుల వినతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పీజీఆర్ఎస్‌లో జేసీ మయూర్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతట్ల ఎంపీటీసీ, సర్పంచ్

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చింతగట్ల గ్రామంలో సర్వేనంబర్ 81.3లో ప్రభుత్వానికి చెందిన కొండ పోరంబోకులో ఐదెకరాల భూమిని కాజేసేందుకు చేసిన ప్రయత్నంపై ఆదివారం 'సర్కార్ భూమికి స్కెచ్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జేసీ మయూర్ అశోక్ స్పందించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని పెందుర్తి తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దారు, సిబ్బంది చింతగట్ల కొండను పరిశీలించారు. అయితే ఆ స్థలంపై ఫీల్డ్ సర్వే చేయాలని ఒక వ్యక్తి చేసిన దరఖాస్తును రెవెన్యూ రికార్డుల మేరకు పరిశీలించిన తరువాతే సర్వేయర్‌కు ఆదేశాలు ఇవ్వాలి. కానీ తహసీల్దార్ కార్యాలయ అధికారులు వెనుకా ముందు ఆలోచించకుండా సర్వేకు అనుమతించాలని సచివాలయ సర్వేయర్‌ను ఆదేశించారు. దీని వెనుక అధికార పార్టీ నేతకు చెందిన బంధువొకరి ఒత్తిడి ఉందన్న ఆరోపణలున్నాయి. తీరా సర్వే చేశాక ఇచ్చిన నివేదిక మేరకు తన పేరిట ఐదు ఎకరాలను నమోదు చేయాలని దరఖాస్తుదారుడు ఒత్తిడి తీసుకురావడం, అందుకు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో జిల్లా అధికారులు స్పందించి వాస్తవ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఇదిలావుండగా సోమవారం గ్రామ సర్పంచ్ జి.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ నందవరపు అప్పలరాజు, తదితరులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీని కలిసి కొండ పోరంబోకు భూమిని రక్షించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన దిగుమర్తి జయలక్ష్మి అనే మహిళకు దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సర్వే నంబరు 83లో పట్టా ఇచ్చారని పేర్కొన్నారు. అయితే రైవాడ కాలువ, పేదలకు ఇళ్ల కోసం 1996లో జయలక్ష్మికి ఇచ్చిన పట్టాతోపాటు మరికొన్ని పట్టాలను అధికారులు రద్దు చేసి భూమి వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. కాగా జయలక్ష్మి వారసులైన మారుతీకుమార్ తనకు సర్వే నంబరు 81-3లో ఐదెకరాలకు సంబంధించి పట్టా ఉందని పేర్కొంటూ ఇచ్చిన దరఖాస్తు మేరకు సర్వే చేసిన ఎల్‌పీఎంను రెవెన్యూ అధికారులు జారీ చేశారని గుర్తుచేశారు. తక్షణమే ఎల్‌పీఎం రద్దు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

రేపటి నుంచి ఎస్సీ కమిషన్ సభ్యుని పర్యటన

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటించనున్నారు. ఇందులో భాగంగా 16న ఆయన రాజమహేంద్ర వరం నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి రాత్రి ఏడున్నరకు విశాఖ చేరుకుని హెచ్‌పీసీఎల్ అతిథిగృహంలో బస చేస్తారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు మిందిలోని బీహెచ్‌ఈఎల్ ప్లాంటును సందర్శించి, అక్కడి అధికారులతో సమావేశమవుతారు. సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్సీ సంఘాల వారితో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షిస్తారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంటును సందర్శించి అక్కడి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, సీపీతో సమావేశమై పలు అంశాలను సమీక్షిస్తారు. సమావేశంలో రామచందర్‌తో పాటు ఉన్నతాధికారులు పీఎస్ క్రాంతికుమార్, సునీల్‌కుమార్‌బాబు, డి.వరప్రసాద్, చొక్కాం నవీన్‌కుమార్, తదితరులు పాల్గొంటారు. 19వ తేదీ రాత్రి ఆయన విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

పడకేసిన డయాలసిస్ యూనిట్లు

... 3వ పేజీ తరువాయి

ఎదురవుతున్నాయి. మూడు వారాలుగా మెషీన్లు పనిచేయకపోయినా ఆస్పత్రి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించేందుకు కృషిచేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే తమలాంటి వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని రామారావు అనే రోగి సహాయకుడు పేర్కొన్నారు. ఉదయం నుంచి డయాలసిస్ కోసం నిరీక్షిస్తున్నామని, ఇంకా సమయం పడుతుందని చెబుతున్నారని వెల్లడించాడు.

కొత్తవి కొనుగోలు అవసరం

ఇకపోతే, పాడైన ఐదు మెషీన్లలో మూడు పూర్తిగా పనిచేయని స్థితికి చేరినట్టు తెలిసింది. మిగిలిన మెషీన్లు కూడా ఏళ్ల తరబడి నుంచి సేవలు అందిస్తున్నవి కావడంతో ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి.దీనివల్ల రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తడయాలసిస్ మెషీన్లు కొనుగోలు చేయడం ఒక్కటే ఈ సమస్యకుశాశ్వత పరిష్కారమని వైద్యులు సూచిస్తున్నారు.

భగవన్నామస్మరణతో శాంతిసౌభాగ్యాలు

అన్నమయ్య కళాక్షేత్రం తిరుమల పీఠాధిపతి విజయశంకర స్వామీజీ

సింహాచలం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో భగవన్నామ స్మరణతో శాంతి సౌభాగ్యాలు లభిస్తాయని అన్నమయ్య కళాక్షేత్రం తిరుమల పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ అన్నారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం భక్తబృందం సారథ్యంలో సింహగిరిపై రాజగోపుర సమీప కళావేదికలో సోమవారం అన్నమయ్య సంకీర్తనల భజనలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ నేటి ఆధునిక కాలంలో తప్పనిసరిగా కొంత సమయాన్ని దైవ నామస్మరణకు వినియోగించాలని సూచించారు. నామస్మరణ ద్వారా లభించు ప్రకంపనలతో పరిసరాలు, మనసు నిర్మలమై సుఖజీవనం సాగించగలుగుతామన్నారు. ఉత్తరాంధ్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులతో త్వరలో సింహగిరిపై భారీ స్థాయిలో అన్నమయ్య సంకీర్తనల భజనలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు వై.అప్పారావు, కార్యదర్శి కేసీహెచ్ నాగేశ్వరరావు, కోశాధికారి రామారావు, సమన్వయకర్త ఆర్.భగవాన్‌దాసు తదితరుల సారథ్యంలో సుమారు గంటన్నరపాటు అన్నమయ్య సంకీర్తనల భజనలు చేశారు.

కులధ్రువీకరణ పత్రాల జారీలో ఆటంకాలు తొలగించండి

» ఎమ్మెల్యే గంటాను కోరిన కళింగ వైశ్యుల సంఘం ప్రతినిధి టి.సంతోష్

సాగర్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కళింగవైశ్యులు కులధ్రువీకరణ పత్రాలు పొందడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని బీసి-డి కుల ధ్రువీకరణ పత్రాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా మంజూరు చేయించాలని భీమిలి శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావుకు సాగర్‌నగర్ వల్లభగణపతి కళింగవైశ్య సామాజికవర్గ అధ్యక్షుడు టి.సంతోష్ విజ్ఞప్తి చేశారు. కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో తలెత్తుతున్న ఇబ్బంది కారణంగా తమ సామాజికవర్గ విద్యార్థులు రిజర్వేషన్ సౌకర్యం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కళింగవైశ్యుల సామాజిక భవనానికి స్థలం కేటాయించేందుకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని అభ్యర్థించినట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు పి.బాబూరావు, డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు

... 3వ పేజీ తరువాయి

అగరపు దేముడు, గండ్రెడ్డి వెంకటరావు నియమితులయ్యారు. అదేవిధంగా పద్మనాభం సొసైటీకి చైర్‌పర్సన్‌గా మొకర అప్పలనాయుడు, పర్సన్లుగా కొండపల్లి నాయుడుబాబు, కిలారు రమణ, రెడ్డిపల్లి సొసైటీకి చైర్‌పర్సన్‌గా కర్నెడ్డి శ్రీరాములు, పర్సన్‌లుగా కారెపు కృష్ణ, కారుకొండ అప్పలనాయుడు, గంధవరం సొసైటీకి చైర్‌పర్సన్‌గా జుత్తాగ గణేష్, పర్సన్లుగా లగుడు సన్యాసినాయుడు, రొంగలి అప్పల సూర్యనారాయణ, పాండ్రంకి సొసైటీకి చైర్‌పర్సన్‌గా బర్నాల సత్య శ్రీనివాసరావు, పర్సన్లుగా దొంతల అప్పనాయుడు, పాండ్రంకి అప్పలనాయుడు, పెందుర్తి సొసైటీకి చైర్‌పర్సన్‌గా అయితి సింహాచలం, పర్సన్లుగా ఉగ్గిన అచ్చిబాబు, సిరికి అవతారం నియమితులయ్యారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. సోమవారం ఉషఃకాలంలో సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను సర్వాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆగమ శాస్త్రోక్తంగా కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు చేసి వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్రా బెల్లం, మాంగల్యధారణ చేశారు. స్వామికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనం, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శివాజీ నియామకం



జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న శివాజీ

మధురవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా మధురవాడకు చెందిన నాగోతి శివాజీ నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గుంటూరులో ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించిన శివాజీ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను లోతుగా పరిశీలించండి

» ఇంజనీరింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



ఎండాడ రోడ్డులో క్లాప్ వాహనానికి అనౌన్స్‌మెంట్ పరికరం లేకపోవడంపై బాధ్యుడిని ప్రశ్నిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

ఎండాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న కల్వర్టులు, కాలువలు, ఫుట్‌పాత్‌లు సహా మరిన్ని అభివృద్ధి పనుల్లో అజాగ్రత్తగా ఉండకుండా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టితో పర్యవేక్షించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. 8వ వార్డు పరిధిలోని బీచ్ రోడ్డు నుంచి ఎండాడ, ఎల్‌ఎల్‌పీ లేఅవుట్ మీదుగా అభివృద్ధి చేసిన 100 అడుగుల రోడ్డుతో పాటు ప్రతిపాదిత విస్తరణ రహదారిని ప్రధాన ఇంజనీర్ పల్లమరాజు, జెడ్సీ కనకమహాలక్ష్మితో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఎస్‌ఎల్‌పీ కనెక్టింగ్ రోడ్డు నుంచి వేసిన 60 అడుగుల రోడ్డు కొలతలను తొలుత పరిశీలించారు. కల్వర్ట్ పనుల్లో నాణ్యతను చూసి, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు ఎక్కడెక్కడ తనిఖీలు చేసిందీ ఏజెన్సీ ప్రతినిధులను అడిగారు. పనులను మరింత లోతుగా పరిశీలించాలని ప్రధాన ఇంజనీర్‌ను ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనుల్లో అవకతవకలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతిరాజు, ఏసీపీ తిరుపతిరావులను కమిషనర్ ఆదేశించారు. అదే రోడ్డులో వస్తున్న క్లాప్ వాహనాన్ని ఆపి అందులో అనౌన్స్‌మెంట్ పరికరాలు పనిచేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లాప్ వాహనాలలో అన్ని పరికరాలు పనిచేసేలా చూడాలని జెడ్సీ, సహాయ వైద్యాధికారి ఎన్.కిషోర్‌లను ఆదేశించారు.

మరో పార్కుకు ఎసరు

... 3వ పేజీ తరువాయి

పార్కులు అన్యాక్రాంతం అయిపోయాయంటూ జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. నగరం నడిబొడ్డున ఉన్న రూ.90 కోట్లు విలువైన పార్కు స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్కులో అభివృద్ధి పనులపై అనుమానాలు

ఫేకర్ లేఅవుట్‌లోని పార్కులో అభివృద్ధి పనులకు జీవీఎంసీ రూ.1.6 కోట్లు వెచ్చించింది. వాకింగ్ ట్రాక్, కార్ పార్కింగ్, వాచ్‌మెన్ కోసం గది నిర్మించేందుకు రూ.20 లక్షలతో టెండర్ పిలిచారు. అలాగే పార్కు ప్రవేశ ద్వారం, గేటు ఏర్పాటు, వాటర్‌ఫౌంటెయిన్, విద్యుత్ సదుపాయం కోసం రూ.20 లక్షలు, పార్కుస్థలం వాలుగా ఉండడంతో రక్షణ గోడల నిర్మాణానికి రూ.20 లక్షలు, మెట్ల నిర్మాణానికి రూ.20 లక్షలు, సాఫ్ట్‌ల్యాండ్ స్కేపింగ్‌కి రూ.20 లక్షలు, గ్యాలరీ ఇతర పనుల కోసం రూ.20 లక్షలు, స్టేజ్‌తోపాటు చుట్టూ నడకదారి కోసం రూ.20 లక్షలు, పిల్లల ఆట స్థలం అభివృద్ధి, పరికరాల ఏర్పాటుకోసం రూ.20 లక్షలు కేటాయిస్తూ టెండర్లు పిలిచారు. ఆయా పనుల్లో దాదాపు అన్ని పనులను పూర్తిచేసినట్టు అధికారులు రికార్డుల్లో చూపించి సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా చెల్లించేశారు. అయితే పార్కులో చూస్తే ఒక్క ప్రహరీ గోడ తప్పితే వాటర్ ఫౌంటెయిన్‌గానీ, స్టేజీ గానీ, వాకింగ్ ట్రాక్ కానీ, గ్యాలరీ గానీ ఏదీ కనిపించదు. పార్కులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి ఉన్నాయి. అధికారులు రూ.1.6 కోట్లతో పనులు చేపడితే అవన్నీ ఏమైపోయాయో ఇంజనీరింగ్ అధికారులే చెప్పాలి. దీనిపై చీఫ్ ఇంజనీర్ పల్లంరాజును వివరణ కోరగా...తనకు ఆ పనుల గురించి తెలియదని, ఫైల్ తెప్పించుకుని పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తానని సమాధానం ఇచ్చారు.

చెలరేగిపోతున్న భూ కబ్జాదారులు

... 3వ పేజీ తరువాయి

ఉన్నాయని ఆ నియోజకవర్గంలోని గ్రామాల నుంచి కొందరు సమాచారం అందించారు. నరవ గ్రామంలోని సర్వే నంబర్ 36లో ప్రభుత్వ గెడ్డవాగు సుమారు 1.7 ఎకరాలు ఉంది. దీనిని రెవెన్యూ రికార్డుల్లో గెడ్డగా క్లాసిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఖాతా నంబరు 20001202. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గెడ్డవాగుల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వకూడదు. నిర్మాణాలు చేయకూడదు. కానీ గ్రామానికి చెందిన కొందరు కొద్దికొద్దిగా ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించి, ఒక్కొక్కటి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ గెడ్డ అని తెలియక కొనుగోలుచేసినవారు...తరువాత విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు. గెడ్డవాగులో నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు.

గవర జగ్గరాజుపాలెంలో గ్రామానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠాన్ని కొందరు చోటా నాయకులు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మిస్తున్నారు. జీవీఎంసీ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదు. రెవెన్యూ సిబ్బంది కొద్దిరోజుల క్రితం వచ్చి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటికి తూతూమంత్రంగా నాలుగు సిమెంటు పలకలు తొలగించి వెళ్లిపోయారు. అక్కడ కూడా ఇళ్లు నిర్మించి రూ.20 లక్షలకు అమ్ముకుంటున్నారు. చోటా నాయకులకు కూటమి పార్టీ నేతలు వత్తాసుపలుకుతున్నారు. సత్తివానిపాలెంలో లక్ష్మీసాగరం చెరువు కబ్జాకు కొందరు ప్రయత్నిస్తున్నారు. అయినా ఎవరూ అడ్డుకోకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చినముషిడివాడ, పెందుర్తి, కోటనరవ...ప్రతిచోట ప్రభుత్వ సెలవు రోజులు వస్తే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణను అడ్డుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

పోర్టుల్లో డిజిటల్ ఆపరేషన్లు

... 3వ పేజీ తరువాయి

మారుతున్నాయన్నారు. సరకు రవాణాదారులకు నిబంధనల సరళీకరణ, కస్టమ్స్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సముద్ర తీర ప్రాంతం కలిగిన దేశాలన్నీ పోర్టు ఆధారిత అభివృద్ధిని కోరుకుంటున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ గొప్ప సహకారం అందిస్తున్నదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీర ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తున్నారని ప్రశంసించారు. జల రవాణాలో అనేక సవాళ్లు ఉన్నాయని, విశాఖలో నిర్వహిస్తున్న సదస్సులో వాటిపై చర్చ జరుగుతుందన్నారు. వివిధ దేశాల నుంచి 26 మంది ప్రతినిధులు హాజరయ్యారని, మారిటైమ్ వ్యాపారంపై విస్తృత చర్చలు జరుగుతాయన్నారు. భవిష్యత్తులో క్రూయిజ్ పర్యాటకం విశేష ప్రాచుర్యం పొందుతుందన్నారు. పోర్టులు, జల రవాణా శాఖ సెక్రటరీ రామచంద్రన్ మాట్లాడుతూ, పోర్టులు, హార్బర్ల మధ్య కనెక్టివిటీ పెంచడానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని చెప్పారు. పోర్టులు సరకు రవాణా సామర్థ్యం పెంచుకోవలసి ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటివి ఉపయోగించుకుంటూ పోర్టులను ఆటోమేషన్ దిశగా నడిపించాల్సి ఉందన్నారు.

ప్రతి నెల క్రూయిజ్ షిప్

విశాఖపట్నం నుంచి ప్రతి నెల క్రూయిజ్ షిప్ నడిచేలా చర్యలు చేపడుతున్నామని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. బంగాళాఖాతం మిగిలిన సముద్రల్లా నిలకడగా ఉండదని, కొంత అలజడిగా ఉంటుందని, కార్గో నౌకలు నడిపినట్టు పర్యాటక నౌకలను నడపలేరని వివరించారు. ఏదేమైనా విశాఖపట్నం క్రూయిజ్ టెర్మినల్ నుంచి మొదలై ఇతర ప్రాంతాలకు వెళ్లేలా విహార నౌకలను తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖ సహాయ మంత్రి శాంతన్ ఠాకూర్, పోర్టు ఛైర్మన్ అంగముత్తు తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు

- పోర్టు ఏరియాలో రూ.33.49 కోట్లతో బి-ర్యాంప్ నిర్మాణం
- ఫిషింగ్ హార్బర్‌లో రూ.32.61 కోట్లతో ఫింగర్ జెట్టీ, విఫ్ నిర్మాణం
- ఓఎస్‌టీటీ వద్ద రూ.20.87 కోట్లతో రెండు అదనపుబ్రీస్టింగ్ డాల్ఫిన్లనిర్మాణం
- క్రూయిజ్ టెర్మినల్ వద్ద రూ.15.9 కోట్లతో ప్రజా ప్రొమెనేడ్ అభివృద్ధి
- అంబేడ్కర్ శతాబ్ది ఫ్లైఓవర్ నుంచి రూ.8.31 కోట్లతో అదనపు ర్యాంప్
- పోర్టు ఏరియాలో రూ.5.5 కోట్లతో 15 శౌచాలయాల నిర్మాణం

ప్రారంభించిన ప్రాజెక్టులు

- నూతన ఆయిల్ రిఫైనరీ బెర్త్-2 - రూ.42 కోట్లు
- ఓఎస్‌టీటీ వద్ద ఫైర్ ఫైటింగ్ సదుపాయాలు రూ.27 కోట్లు
- ఆర్-10 ప్రాంతంలో కవర్డ్ స్టోరేజీ షెడ్ రూ.22.5 కోట్లు
- డబ్ల్యుక్యు జంక్షన్ నుంచి ఎస్సార్ జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణం - రూ.19.69 కోట్లు
- కస్టమ్స్ ప్రహరీ నిర్మాణం - రూ.7.17 కోట్లు
- ఆర్ఎఫ్ఐడీ గేట్ మేనేజ్‌మెంట్ - రూ.15 కోట్లు
- నూతన పోర్టు ఆపరేటింగ్ సిస్టమ్ - రూ.10.77 కోట్లు
- వెసల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ - రూ.15.83 కోట్లు

సుపరిపాలనకు కార్యాచరణ రూపొందించండి

విభాగాధిపతులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



జీవీఎంసీ విభాగాధిపతులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ సుపరిపాలనకు విభాగాధిపతులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ అన్ని విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో గల వివిధ శాఖ మధ్య సమన్వయంతో కలిసి పని చేయాలని, పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే చర్చించుకొని త్వరగా పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ , టౌన్ ప్లానింగ్ శాఖలు సమన్వయంతో పని చేసుకుంటూ రహదారుల విస్తరణలో గాని టీడీఆర్‌లు ఇచ్చేటప్పుడు గాని ఉమ్మడిగా క్షేత్ర పరిశీలన చేసి తక్కువ సమయంలో నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం సమన్వయంతో పని చేసుకుంటూ గెడ్డల పూడికలు తొలగింపు, వస్తు పరికరాల కొనుగోలు విషయంలో సత్వర ఫలితాలు రాబట్టాలని కమిషనర్ సూచించారు. రెవెన్యూ విభాగం, ఇంజనీరింగ్ విభాగం - కల్యాణ మండపాలు, సంతలు, ఆట స్థలాలు, షాపింగ్ కాంప్లెక్సుల నిర్వహణ పనులు చేసేటప్పుడు ప్రస్తుతం నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లతో సంప్రదించి వారిని సమన్వయపరచుకొని పనులు, ఖర్చులలో వారిని భాగస్వామిని చేయాలని సూచించారు. కొత్త పనులు, నిర్వహణ పనుల్లో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని 25 శాతం నుంచి 75 శాతంగా ప్రజలు భాగస్వామ్యం ఉండేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా, పచ్చదనం-పార్కుల నిర్వహణ.. ఇవి తన ప్రాధాన్యాలని, వీటిపైనప్రత్యేకంగా విశేషమైనకృషి జరగాలని కమిషనర్ అధికారులకు తెలియజేశారు. ఇకపై ప్రతిరోజు శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తామని, ప్రతి శనివారంసిబ్బంది పనితీరును స్వయంగా సమీక్షిస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూలో ఆకట్టుకుంటున్న ఫొటో ఫ్రేమ్



జూలో ఏర్పాటు చేసిన ఫొటో ఫ్రేమ్

ఆరిలోవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో సందర్శకులను ఆకట్టుకొనే విధంగా సీతాకోక చిలుకల పార్కు వద్ద పెద్ద సెల్ఫీ ఫొటో ఫ్రేమ్‌ను జూ సిబ్బంది ఏర్పాటు చేశారు. సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న ఫ్రేమ్ అందంగా కనిపిస్తూ అలరిస్తోంది. జూకు వచ్చే సందర్శకులు ముచ్చట పడి ఇక్కడ సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడుతున్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దరఖాస్తుకు ఈ నెల 21 వరకు గడువు

మద్దిలపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు సంఘం అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు తెలిపారు. శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో 500 మార్కులకు పైగా, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సత్కరిస్తామన్నారు. అధిక మార్కులు తెచ్చుకున్న యాదవ విద్యార్థులు ఈ నెల 21వ తేదీ వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన సవేరా ఫంక్షన్ హాలులో పురస్కారాలు అందిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ : 81434 46565లో సంప్రదించాలన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చిన్నారావు, ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట సత్యనారాయణ, పుట్టి శ్రీనివాసరావు, ముగడ చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



అంబేడ్కర్‌కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ నేతలు

వెంకోజీపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట అంబేడ్కర్‌కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కూటమి సంక్షేమం, అభివృద్ధి పాలన పట్ల నియోజకవర్గంలోని ప్రజలలో మంచి ఆదరణ కనిపిస్తోందన్నారు. ఎన్నికల ముందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటికే చాలా వరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మిగిలిన హామీలు కూడా అతి త్వరలో పూర్తిగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమర్థవంతంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఈ సందర్భంగా వార్డులో ఇటీవల ప్రారంభించిన టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి కార్యాలయం నిర్వాహకులు నారు గోపి, మొల్లి శోభలను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి, విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు మొల్లి శోభ, ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం టీడీపీ మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, ఈగల సత్యం, గొండేలా అప్పన్న, మొల్లి శంకర్, బంగార్రాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం



లోకేశ్ (ఫైల్‌ఫొటో)

ఆరిలోవ, జూలై14(ఆంధ్రజ్యోతి) : తాను ప్రాణాలు విడిచినా ముగ్గురి జీవితాల్లో ఓ యువకుడు వెలుగులు నింపాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం సీతారాంపురంలో నివాసం ఉంటున్న లోకేష్ (36) ఆదివారం సాయంత్రం ఎల్.కోట వద్ద రోడ్డుప్రమాదానికి గురవగా, తీవ్ర రక్తస్రావం అవుతుండగా కుటుంబ సభ్యులు విమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకేశ్‌ను రక్షించేందుకు వైద్యబృందం తీవ్రంగా శ్రమించింది. అయినప్పటికీ లోకేశ్ ఆరోగ్యం క్షీణించడంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు.

ఈ నేపథ్యంలో విమ్స్ డెరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు వెంటనే రోగి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో లోకేశ్ అవయవాలను దానం చేసేందుకు అనుమతులను జారీ చేశారు. అనంతరం.. బ్రెయిన్‌డెడ్ అయిన లోకేశ్ దేహం నుంచి స్వీకరించిన కిడ్నీలు, లివర్‌ను జీవన్‌దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియారిటీ జాబితాలను అనుసరించి అవయవాలను ఆయా ఆస్పత్రులకు కేటాయించారు. పుట్టెడు దుఃఖంలోనూ లోకేశ్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించిన అతడి కుటుంబసభ్యులను పలువురు అభినందించారు.

ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ మాట్లాడుతూ విమ్స్‌లో ఇది ఐదో బ్రెయిన్ డెడ్ కేసు అని తెలిపారు. రోగి కుటుంబ సభ్యులు, బంధువులకు అవగాహన కల్పించడం ద్వారా అవయవదానం విషయంలో విమ్స్ రాష్ట్ర ప్రభుత్వ వైద్యరంగంలో విమ్స్ సరికొత్త చరిత్రను నమోదు చేసిందన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీఐటీయూ నేత సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆరిలోవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (సీఐటీయూ, మద్దిలపాలెం) 8వ మహా సభ సోమవారం తోటగరువులోని ఎర్ని దుర్గమాంబ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం గుదిబండ వంటి చట్ట సవరణను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందని మండిపడ్డారు. దీన్ని కార్మిక వర్గం ఎంతగా వ్యతిరేకిస్తున్నా కేంద్రం వెనక్కు తగ్గకపోవడం దారుణమన్నారు. డ్రైవర్లను వేధించే చట్టాలను తేవడమే కేంద్రం ఉద్దేశంలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, డీజిల్, సీఎన్‌జీపై రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలన్నారు. పోలీసుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా పి.రాజకుమార్, పి.సత్యం, కోశాధికారిగా ఎస్.గురునాథరావు, ఉపాధ్యక్షులుగా జి.చిన్నారావు, రాయపురెడ్డి, కె. చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా టి.రమేష్, కె.రాము, ఎల్. సురేష్‌లతో పాటు మరో ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహా సభలో సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, వెంకటరావు, డి.అప్పలరాజు, గోపి, సీహెచ్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వద్ద చెత్తను తరలించిన దృశ్యం

వెంకోజీపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో చెత్తను తొలగించడంలో పారిశుధ్య సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పారిశుధ్య అధికారులు స్పందించారు. ఇక్కడున్న చెత్తను తొలగించి శుభ్రంగా తీర్చిదిద్దారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో శుభ్రం మేస్త్రి రమణ, శ్రీనులు సిబ్బంది ఈ ప్రాంతంలోనే కాకుండా వార్డులోని అన్ని ప్రాంతాల్లోనూ పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రంగా తీర్చిదిద్దారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 32, పచ్చిమిర్చి 68, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58,అల్లం (పాతది) 48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42,బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

వాహనదారులకు చలానా డ్రైవ్



వాహనదారులకు జరిమానాలు విధిస్తున్న పోలీసులు

సిరిపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రాకపోకలు సాగించే మార్గాల్లోని తమ బాధ్యతగా హెల్మెట్, కారు సీట్‌బెల్ట్ ధరించాలని, తద్వారా సురక్షితమైన ప్రయాణాలకు అవకాశం కలుగుతుందని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం సిరిపురం, ద్రోణంరాజు సర్కిల్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టని హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిబంధనలకు అవగాహన కలిగిస్తున్నప్పటికీ కొంతమందిలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోందన్నారు. ప్రయాణాలు చేస్తున్న సమయంలో విధిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానాలు విధించడం జరిగిందన్నారు. అలాగే రాత్రి పూట నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు జరగకుండా తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు న్యాయం చేస్తాం

ఎస్టీ కమిషన్ చైర్మన్ జీవీవీ శంకరరావు



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సమస్య వివరిస్తున్న అతిథి అధ్యాపకులు

వెంకోజీపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అతిథి అధ్యాపకులు అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ జీవీవీ శంకరరావు హామీ ఇచ్చారు. ఏయూలోని ఎస్టీ అభ్యర్థుల రివ్యూ సమావేశానికి సోమవారం హాజరైన ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం కలిసి వినతిపత్రం అందజేశారు. తామందరినీ కూటమి ప్రభుత్వం హయాంలోనే సిక్స్‌మాన్ కమిటీతో ఎంపిక చేసి ఏయూలో 6 నెలల క్రితం తీసుకోవడం జరిగిందని, ఆరు నెలలు గడవకముందే నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అతిథి అధ్యాపకులు కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అతిథి అధ్యాపకులకు రెన్యువల్ చేయాలని, లేని పక్షంలో రివ్యూలు నిర్వహించాలని కోరారు. కొత్త వారికి ఇంటర్వ్యూలు నిర్వహించుకోవచ్చని, పాత వారికి రెన్యువల్ చేయాలని ఈ సందర్భంగా చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇతర యూనివర్సిటీల మాదిరిగా నెలవారి జీతాలు ఇవ్వాలని, యూజీసీ నిబంధన ప్రకారం గంటకు రూ.1500 లేదా నెలకు రూ.50 వేల వరకు ఇవ్వచ్చని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. నోటిఫికేషన్‌లో పోస్టు డిపార్ట్‌మెంట్ వారాగా తెలియపరచలేదని, రిజర్వేషన్ కూడా సరిగా అమలు కాలేదని చైర్మన్‌కు వివరించారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో ఆరేటి మహేష్, డాక్టర్ జీకేడీ ప్రసాద్, డాక్టర్ ప్రసాద్, దాస్, శిరీష్, డాక్టర్ శ్రీను, డాక్టర్ బాను సురేంద్ర, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌బీ కాలనీ సమీపం ఉమానగర్‌లో ఉంటున్న శిరిల దుర్గపై దాడికి పాల్పడిన ఆరిలోవకు చెందిన ఎడ్డ దేముడుపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఫిర్యాదు నేపథ్యంలో దేముడును పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై కూడా దాడికి పాల్పడడంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అతడిప మరో కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలా ఉన్నాయి.

శిరిల దుర్గ తన భర్తతో విభేదాలు కారణంగా పిల్లలతో పాటు ఉమానగర్‌లో ఉంటోంది. కొంతకాలం క్రితం పరిచయమైన ఎడ్డ దేముడు ఆమెను, పిల్లలను బాగా చూసుకుంటానని నమ్మించి తరచూ వచ్చేవాడు. తర్వాత కాలంలో తరచూ వేధిస్తుండడం, కొట్టడం కారణంగా ఆమె అతడిని దూరం పెట్టింది. ఆదివారం ఇంటికి వచ్చి దుర్గపై దాడి చేసి, కూరగాయలు కోసే కత్తితో హత్య చేయడానికి ప్రయత్నించడంతో ఆ పరిసరాల్లో ఉన్న వారు పోలీసులకు సమాచారం అందించారు.

అక్కడకు వచ్చిన నాగేశ్వరరావు అనే కానిస్టేబుల్‌పై సైతం దేముడు దాడి చేసి పరారయ్యాడు. దీంతో కానిస్టేబుల్, దాడికి గురైన శిరిల దుర్గ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు ఎడ్డ దేముడుపై రెండు కేసులు నమోదు చేశారు.

పార్కుల వివరాలు తెలపండి

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమైన మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పార్కుల వివరాలు తెలియపరచాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీలో అన్ని జోన్లలో ఎన్ని పార్కులు, ఖాళీ స్థలాలు ఉన్నాయో వాటి వివరాలు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎన్ని పార్కులు ఆక్రమణకు గురయ్యాయని, ఎన్ని పార్కులు కోర్టు కేసుల్లో ఉన్నాయో పూర్తి వివరాలు మూడు రోజుల్లో అందించాలని ఆదేశించారు. అన్యాక్రాంతంలో ఉన్న పార్కులు, ఖాళీ స్థలాల వివరాలపై తనకు అవగాహన ఉందని, పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక అందించాలని పట్టణ ప్రణాళిక విభాగాధిపతులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, డీసీ(ఆర్) ఎస్.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్లు మీనాకుమారి, ధనుంజయరెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్లు హరిదాస్, రామ్మోహన్, జీవీఎంసీ రెవెన్యూ అధికారులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ఇతర పట్టణ ప్రణాళిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గిరిధర్



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులై గిరిధర్‌కు కండువా కప్పి అభినందిస్తున్న ఆర్.కృష్ణయ్య

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా నల్లాన వెంకటకృష్ణ గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకాలమ్మ చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య కండువా కప్పి గిరిధర్‌ను బీసీ ఉద్యమంలోకి ఆహ్వానిస్తూ బీసీల హక్కుల పరిరక్షణకోసం, వారికి రాజ్యాధికారం దక్కే వరకు ఎల్లవేళలా ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ జాతీయ బీసీ సంఘం లక్ష్యాల మేరకు బీసీల హక్కుల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. హైదరాబాదులో ఆర్ కృష్ణయ్య కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' కోసం అకౌంట్లు ఓపెన్ చేసుకోవాలి

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో భాగంగా రెండో విడత కింద ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నిధులు జమ చేయనున్నదని, ఇందుకోసం లబ్ధిదారులు బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు ఒక ప్రకటనలో కోరారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులైతే తల్లి పేరిట, ఇంటర్ చదువుతున్న విద్యార్థులైతే తమ పేరిట బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. ఈ రెండు కేటగిరీలకు చెందిన వాళ్లు సమీపంలోని పోస్టాఫీసు లేదా బ్యాంకులో ఈ నెల 16వ తేదీలోగా అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసుకున్నవాళ్లు ఆధార్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని సూచించారు.

23 నుంచి ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

దరఖాస్తుల దాఖలుకు గడువు 20

కంచరపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడతలో మిగులు సీట్లకు ఈ నెల 23 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ఐటీఐల కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు అభ్యర్థులు ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను సమీపంలోని ఐటీఐల్లో తనిఖీ చేయించుకోవడానికి ఈ నెల 22 వరకు అవకాశం ఉందన్నారు. జూలై 23 నుంచి 25 వరకు జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రైవేటు ఐటీఐల్లో సీట్లకు 26, 27తేదీల్లో కౌన్సెలింగ్ జరగనున్నది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని శ్రీకాంత్ సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన జరగని అభ్యర్థుల పేర్లు మెరిట్ లిస్టులో సూచించబోమని స్పష్టం చేశారు.

వీధి దీపాల కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

జీవీఎంసీ కమిషనర్‌కు 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఫిర్యాదు



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మొల్లి హేమలత

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తమ వార్డు పరిధిలోని వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, బాధ్యుడైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతూ ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. కొండవాలు, శివారు ప్రాంతాలైన జేఎన్ఎన్‌యూఆర్ఎం, పీపీ1, పీపీ2 కాలనీల్లో వీధి దీపాల సమస్య నిత్యం వేధిస్తోందన్నారు. వీధి దీపాల సమస్యలపై ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పదిలైట్లు పాడైపోతే కేవలం రెండు, మూడు మాత్రమే అమర్చి మిగిలినవి వదిలేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా నాణ్యత లేని బల్బులు, తక్కువ వెలుతురు సామర్థ్యం కలిగిన లైట్లను అమర్చడం వల్ల రెండు, మూడు రోజులకే అవి పాడైపోతున్నాయని వివరించారు. ప్రస్తుతం తమ వార్డు పరిధిలో 198 లైట్లు పూర్తిగా వెలగడం లేదని, మరో 192 లైట్లు పాక్షికంగా వెలుగుతున్నాయన్నారు. రాత్రి వేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున కాంట్రాక్టర్‌ను తప్పించి కొత్తకాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించడం, లేదంటే ప్రస్తుత కాంట్రాక్టర్‌తో టెండరు ఒప్పందం ప్రకారం పని చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

రేపటి నుంచి ఎస్సీ కమిషన్ సభ్యుని పర్యటన

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటించనున్నారు. 16న రాజమహేంద్రవరం నుంచి రోడ్డుమార్గం గుండా బయలుదేరి రాత్రి 7.30 గంటలకు విశాఖ చేరుకుని హెచ్‌పీసీఎల్ అతిథిగృహంలో బస చేస్తారు. 17న ఉదయం 11 గంటలకు మిందిలోని బీహెచ్‌ఈఎల్ ప్లాంటు అధికారులతో సమావేశమవుతారు. సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్సీ సంఘాలతో సమీక్షిస్తారు. 18న ఉదయం హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంటును సందర్శించి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో సమీక్షిస్తారు 19న రాత్రి ఆయన విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

పైలా అవినాష్

(3వ పేజీ తరువాయి)

21 మందిని, గ్రేడ్-'బి'లో 112 మందిని, గ్రేడ్-'సి'లో 378 ఆటగాళ్లను వేలంలో ఉంచారు. ఆల్‌రౌండర్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. రాయల్స్ ఆఫ్ రాయలసీమ, భీమవరం బుల్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్ షైనర్స్, కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ జట్లకు చెందిన ఫ్రాంచైజర్లు వేలంలో పాల్గొన్నారు. వేలానికి ముందు టాప్ సీడ్‌లో ఉన్న తొమ్మిది మంది ఆటగాళ్లలో ఎనిమిది మందిని ఏడు జట్లు సొంతం (రిటైన్) చేసుకున్నాయి. రిటైన్ చేసుకున్న వారిలో హనుమ విహారి (రూ.10 లక్షలు, అమరావతి రాయల్స్), అశ్విన్ హెబ్బర్ (రూ.10 లక్షలు, విజయవాడ సన్‌షైనర్స్), రషీద్ (రూ.10 లక్షలు, తుంగభద్ర వారియర్స్), కేవీ శశికాంత్ (రూ.5 లక్షలు, తుంగభద్ర వారియర్స్), రికీ బుయ్ (రూ.10.26 లక్షలు, సింహాద్రి వైజాగ్ లయన్స్), శ్రీకర్ భరత్ (రూ.10 లక్షలు, కాకినాడ కింగ్స్), కె.నితీష్‌కుమార్‌రెడ్డి (రూ.10 లక్షలు, భీమవరం బుల్స్) ఉన్నారు.

పైలా అవినాష్....రూ.11.5 లక్షలు

గ్రేడ్-ఏలోని 21 మంది ఆటగాళ్లలో ఒకడైన నగర క్రికెటర్ పైలా అవినాష్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు ఫ్రాంచైజర్లు రూ.11.5 లక్షలకు కొనుగోలు చేశారు. ఏపీఎల్ సీజన్-4లో అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా అవినాష్ రికార్డు నెలకొల్పాడు. తర్వాత స్థానంలో ఉన్న రిక్కీ బుయ్ (రూ.10.26 లక్షలు)తోపాటు రూ.10 లక్షలకు రిటైన్ చేసుకున్న నితీష్‌కుమార్‌రెడ్డి, శ్రీకర్ భరత్ కూడా విశాఖకు చెందినవారు కావడం గమనించదగ్గ విషయం.

ఏయూలో అగ్రిమెంట్‌పై రచ్చ

(3వ పేజీ తరువాయి)

కాంట్రాక్టు అధ్యాపకులు గడిచిన కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. అయితే, ఉన్నత స్థాయి ఆదేశాలతో వర్సిటీ అధికారులు అగ్రిమెంట్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారు. కాంట్రాక్టు అధ్యాపకులతో అగ్రిమెంట్ చేయించుకోవాలంటూ వైస్ చాన్సలర్ నుంచి కాలేజీ ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు అందాయి. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్స్ అగ్రిమెంట్ పత్రాలపై సంతకాలు చేయించుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే అందులోని నిబంధనలను వ్యతిరేకిస్తూ సంతకాలు పెట్టేందుకు కాంట్రాక్టు అధ్యాపకులు ముందుకురావడం లేదు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకాలు చేయబోమని కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతుంటే, అగ్రిమెంట్‌పై సంతకాలు చేయించే బాధ్యత ప్రిన్సిపాల్స్‌దేనని వైస్ చాన్సలర్ స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు జఠిలంగా మారింది.

ఇదీ సమస్య?

వర్సిటీలో పది, పదిహేనేళ్లుగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. అయితే, వారితో ఒప్పందాలు చేసుకోవాలంటూ ఉన్నత స్థాయి నుంచి వర్సిటీ అధికారులకు ఆదేశాలు అందినట్టు చెబుతున్నారు. ఆ మేరకు పత్రాలను అధికారులు సిద్ధం చేశారు. అయితే, అందులో ఉన్న నిబంధనలు తమకు అన్యాయం చేసేలా ఉన్నాయంటూ కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతున్నారు. 'వర్క్ లేకపోతే తొలగింపు', 'ఎట్టి పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించకూడదు', 'రాజకీయ నాయకులను కలవకూడదు', 'ఎప్పుడైనా తొలగించే అధికారం'...వంటి అంశాలు ఉన్నాయి. అవన్నీ తమ హక్కులను హరించేలా ఉన్నాయంటూ కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు అధ్యాపకులంతా సోమవారం ఆయా ప్రిన్సిపాల్స్‌ను కలిసి తాము సంతకాలు చేయబోమని స్పష్టంచేశారు. దీనిపై ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయాన్ని బట్టి న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధపడుతున్నట్టు తెలిసింది.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు

(3వ పేజీ తరువాయి)

అగరపు దేముడు, గండ్రెడ్డి వెంకటరావు నియమితులయ్యారు. అదేవిధంగా పద్మనాభం సొసైటీకి చైర్‌పర్సన్‌గా మొకర అప్పలనాయుడు, పర్సన్లుగా కొండపల్లి నాయుడుబాబు, కిలారు రమణ, రెడ్డిపల్లి సొసైటీకి చైర్‌పర్సన్‌గా కర్నెడ్డి శ్రీరాములు, పర్సన్‌లుగా కారెపు కృష్ణ, కారుకొండ అప్పలనాయుడు, గంధవరం సొసైటీకి చైర్‌పర్సన్‌గా జుత్తాగ గణేష్, పర్సన్లుగా లగుడు సన్యాసినాయుడు, రొంగలి అప్పల సూర్యనారాయణ, పాండ్రంకి సొసైటీకి చైర్‌పర్సన్‌గా బర్నాల సత్య శ్రీనివాసరావు, పర్సన్లుగా దొంతల అప్పనాయుడు, పాండ్రంకి అప్పలనాయుడు, పెందుర్తి సొసైటీకి చైర్‌పర్సన్‌గా అయితి సింహాచలం, పర్సన్లుగా ఉగ్గిన అచ్చిబాబు, సిరికి అవతారం నియమితులయ్యారు.

పూర్ణామార్కెట్ హద్దులు, గెజిట్ మార్చండి

» పీజీఆర్‌ఎస్‌లో జోనల్ కమిషనర్లకు వినతులు



జడ్సీ రాముకు వినతిపత్రం అందజేస్తున్న గొల్లకంచరపాలెం ప్రజలు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని సర్దార్‌వల్లబాయ్‌పటేల్ హోల్‌సేల్ మార్కెట్ (పూర్ణామార్కెట్) ఆశీలు వసూలుకు సంబంధించిన గెజిట్, నిర్దేశిత హద్దులను సవరించాలని కోరుతూ జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడుకు సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో పలువురు వినతిపత్రాలు అందజేశారు. పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలుచేస్తున్న కాంట్రాక్టర్ గెజిట్‌లో పేర్కొన్న ధరలకంటే నాలుగురెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారని దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. అలాగే ఆశీలు వసూలుకు నిర్దేశించిన ప్రాంతం దాటి మరీ దుకాణాల నుంచి ఆశీలు వసూలుచేస్తున్నారని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై వ్యాపారులు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా కాంట్రాక్టర్ దౌర్జన్యంగా వసూళ్లు కొనసాగిస్తున్నారని వివరించారు. దీనివల్ల జీవీఎంసీకి ఆదాయం రాకపోగా, కాంట్రాక్టర్‌కు భారీగా లబ్ధి కలుగుతోందని విన్నవించారు. ఇప్పుడు వసూలుచేస్తున్న ధరలనే గెజిట్‌లో చేర్చడంతోపాటు హద్దులను కూడా ఇప్పుడు ఆశీలు వసూలుచేస్తున్న ప్రాంతాలకు విస్తరించాలని కోరారు. దీనివల్ల 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆశీలు వసూలుకు వేలం నిర్వహించినపుడు ఆయా సవరణలు చేసి, అప్‌సెట్ ధరను పెంచితే జీవీఎంసీకి నాలుగురెట్లు ఆదాయం పెరుగుతుందని వివరించారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ వారికి సమాధానమిచ్చారు.

సచివాలయాల క్లస్టర్ల మార్పునకు వినతి

జ్ఞానాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులకు ఇప్పుడు వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, సచివాలయానికి వెళ్లి ఏ సమస్య ఉన్నా, దరఖాస్తు చేసుకోవాలన్నా రెండు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని 200 కుటుంబాల వారు వాపోయారు. తమ ఈ సమస్యను పరిష్కరించాలని కొరుతూ సోమవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో 56వవార్డు గొల్ల కంచరపాలెం ప్రజలు జనసేన నాయకులు పెంటకోట శివ, గౌరీ శంకర్‌ల సహకారంతో జోనల్ కమిషనర్ బి.రాముకు వినతిపత్రం అందజేశారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్‌కు మూడు ఫిర్యాదులు అందాయని జడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ తార ప్రసన్న, ఆర్‌ఓ రాజ్యలక్ష్మి, ఏపీడీ కృపానందం, డీఈ భరణి పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించండి

»కలెక్టర్, కమిషనర్‌ను కోరిన స్థానికులు



స్థానికులు తరలించమని కోరుతున్న మద్యం దుకాణం

జ్ఞానాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 41వ వార్డు ఎఫ్‌సీఐ గోదాము వద్ద దేవాలయం, పాఠశాలలు, కళాశాలలు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ఎలా అనుమతిచ్చారు? ఆ దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ సోమవారం గవరకంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు జిల్లా కలెక్టరు, జీవీఎంసీ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. స్థానికుల నుంచి అభ్యంతరాలు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన పైడిమాంబ అమ్మవారి ఆలయానికి ప్రతి రోజు వందలాది మంది మహిళలు, చిన్నారులు వస్తుంటారని, అలానే దుకాణం ఏర్పాటు చేసిన ప్రాంతం దగ్గరలోనే పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉండడంతో నిత్యం ఇదే దారిన విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. మందుబాబుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొనకముందే మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణకు గురైన విశ్వేశ్వర స్వామి దేవస్థానం స్థలం స్వాధీనం

మహారాణిపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన విశ్వేశ్వర స్వామి దేవస్థానం స్థలాన్ని ఎండోమెంట్ ట్రైబ్యూనల్ కోర్టు తీర్పు మేరకు ఆక్రమణదారుల నుంచి దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని సూర్యబాగ్ సమీపంలోని విశ్వేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించి టి.ఎస్. నెంబరు 1665లో గల 78 చదరపు అడుగుల ఖాళీ స్థలం ఆక్రమణకు గురైంది. దీనిపై దేవదాయ శాఖ ట్రైబ్యూనల్ కోర్టులో కేసు దాఖలు చేయగా, దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనితో ఆక్రమణదారుడు దేవదాయ శాఖ జిల్లా అధికారిణి టి.అన్నపూర్ణ, దేవాలయ మేనేజర్ ఎ.దేముళ్లకు ఈ స్థలాన్ని అప్పగించటంతో అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలాన్ని బహిరంగ వేలం ద్వారా లీజుకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ట్యాబ్‌లను అందచేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నుంచి ట్యాబ్‌లు అందుకుంటున్న ఆర్పీలు

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

అక్కయ్యపాలెం/సీతంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో విధులు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లకు ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల శాసనసభ్యులు పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు సోమవారం వేర్వేరు చోట్ల ట్యాబ్‌లను అందజేశారు. అక్కయ్యపాలెంలోని షాదీఖానా మండపంలో విష్ణుకుమార్‌రాజు, సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో వంశీకృష్ణలు వీటిని అప్పగించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఆర్పీలకు వారు సూచించారు. వీటి సహాయంతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు వేగంగా ప్రజలకు అందుతాయన్నారు. ప్రభుత్వ సర్వేలు త్వరితగతిన పూర్తి చేసేందుకు వీటిని ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఈ కార్యక్రమాల్లో జోనల్ కమిషనర్ రాము, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక, జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ముమ్మిన నాగమణి, అక్కిరెడ్డి జగదీష్, ఆంథోని శేఖర్, మధుబాబు, వంక సంజీవరావు, కూటమి శ్రేణులు, ఏపీడీ పుణ్యవతి, సీవోలు పాల్గొన్నారు. ట్యాబ్‌లు అందుకున్న ఆర్పీలు ఉత్సాహంగా వెనుదిరిగారు.

యాదవ విద్యార్థులకు 27న ప్రతిభా పురస్కారాలు

డాబాగార్డెన్స్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన యాదవ విద్యార్థులకు ఈ నెల 27న పురస్కారాలతో పాటు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సంఘం సభ్యులు సోమవారం తెలియజేశారు. పదో తరగతి సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈలో 500 మార్కులకుపైగా, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకుపైగా, ఎన్‌ఐటీ, ఐఐటీ, నీట్‌లో ప్రతిభ చాటిన వారిని సత్కరిస్తామన్నారు. ఈ నెల 21లోగా 81434 46565 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షుడు పి.చిన్నారావు, అధ్యక్షుడు వి.రాజారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్‌యాదవ్, ఎం.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, మంగరాజు, ప్రకాష్, ఎం.చంద్రశేఖర్, బంధం రాజు, శ్రీధర్, వెంకటరమణ, యు.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఏరోస్పేస్‌పై శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో డిప్యూటీ డైరెక్టర్ డా.ఎంవీపీ రామకృష్ణ తదితరులు

కంచరపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్‌లో పారిశ్రామిక శిక్షణ పూర్తిచేసుకున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎంవీపీ రామకృష్ణ హాజరయ్యారు. బోయింగ్ నుంచి గ్రాంట్ ద్వారా లెర్న్ అండ్ ఎర్న్ కింద జిల్లాలోని కంచరపాలెం, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 50 మంది శిక్షణ పొందారు. వీరికి ధ్రువపత్రాలను రామకృష్ణ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరోస్పేస్ రంగంలో యువత కెరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లిమిటెడ్, జీఈ ఏరోస్పేస్, ఎల్&టీ డిఫెన్స్, మారుతీ సుజుకి, రాయల్ ఎన్‌ఫీల్డ్ తదితర కంపెనీల్లో విద్యార్థులు ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఢిల్లీ చీఫ్ జనరల్ మేనేజర్ అనురాగ్ శర్మ, మేనేజర్ శేఖర్ రెడ్డి, ఎంఎస్‌ఎంఈ డీజీఎం ప్రసాద్ రెడ్డి, శిక్షణ అధిపతి డా.మురళీకృష్ణ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపునీటితో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి

అధికారులకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశం



42వ వార్డులో అధికారులు, స్థానికులతో కలిసి గెడ్డను పరిశీలిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

అక్కయ్యపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 42వ వార్డు పరిధిలో ఉన్న చాకలిపేట, ఎర్రగెడ్డ, కోళ్ల ఫామ్ బ్రిడ్జ్, దొండపర్తి తదితర ప్రాంతాల్లో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చాకలి గెడ్డ ప్రాంతంలో వర్షపు నీరు అధికంగా చేరుకోవడానికి గల ఇబ్బందులపై అధికారులను వాకబు చేశారు. చాకలి గెడ్డ ప్రాంతంలో ఉన్న గోడ నిర్మాణం వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా ముంపు ప్రాంతాల్లో పర్యటించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ ఇబ్బందులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే కోళ్ల ఫామ్ బ్రిడ్జిలో నీరు పారే విధానాన్ని అధికారులతో చర్చించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, కార్పొరేటర్ లీలావతి శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కంచరపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ఆపదలో ఎదుటవారి ప్రాణాలను కాపాడుతుందని ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ఎన్‌ఎస్‌ఎస్, వాల్తేర్ డివిజన్ లయన్స్ క్లబ్ సహకారంతో ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో రక్తదానం ముఖ్యమైనదన్నారు. 18 ఏళ్లు నిండి ఆరోగ్యంగా ఉన్నవారంతా రక్తదానం చేయవచ్చునన్నారు. యువత రక్తదానానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం 39 మంది ద్వారా సేకరించిన రక్తాన్ని వాల్తేర్ లయన్స్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, డా.ఎస్.ప్రశాంత కుమారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వి.శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

కంచరపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చి కంచరపాలెం పోలీసులు మానవత్వాన్ని ప్రదర్శించారు. అన్నవరం ప్రాంతానికి చెందిన రాగతి రమేష్ (4) ఇంటి నుంచి నగరంలోని రెడ్డికంచరపాలెంలో బంధువుల ఇంటికి తల్లి రాగతి అరుణతో కలిసి కొద్దిరోజుల క్రితం వెళ్లాడు. అనంతరం అక్కడ బాలుడు తప్పిపోవడంతో 112 కాల్ ద్వారా తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కంచరపాలెం సీఐ కె.రవికుమార్ బాలుడి ఆచూకీ కోసం సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాలుడు కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద సంచరిస్తున్నట్టు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ రవికుమార్ బాలుడిని సోమవారం తల్లి అరుణకు అప్పగించారు.

మరో పార్కుకు ఎసరు

(3వ పేజీ తరువాయి)

పార్కులు అన్యాక్రాంతం అయిపోయాయంటూ జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. నగరం నడిబొడ్డున ఉన్న రూ.90 కోట్లు విలువైన పార్కు స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్కులో అభివృద్ధి పనులపై అనుమానాలు

పేకర్ లేఅవుట్‌లోని పార్కులో అభివృద్ధి పనులకు జీవీఎంసీ రూ.1.6 కోట్లు వెచ్చించింది. వాకింగ్ ట్రాక్, కార్‌పార్కింగ్, వాచ్‌మెన్ కోసం గది నిర్మించేందుకు రూ.20 లక్షలతో టెండర్ పిలిచారు. అలాగే పార్కు ప్రవేశ ద్వారం, గేటు ఏర్పాటు, వాటర్‌ఫౌంటెయిన్, విద్యుత్ సదుపాయం కోసం రూ.20 లక్షలు, పార్కుస్థలం వాలుగా ఉండడంతో రక్షణ గోడల నిర్మాణానికి రూ.20 లక్షలు, మెట్ల నిర్మాణానికి రూ.20 లక్షలు, సాఫ్ట్‌ల్యాండ్ స్కేపింగ్‌కి రూ.20 లక్షలు, గ్యాలరీ ఇతర పనుల కోసం రూ.20 లక్షలు, స్టేజ్‌తోపాటు చుట్టూ నడకదారి కోసం రూ.20 లక్షలు, పిల్లల ఆట స్థలం అభివృద్ధి, పరికరాల ఏర్పాటు కోసం రూ.20 లక్షలు కేటాయిస్తూ టెండర్లు పిలిచారు. ఆయా పనుల్లో దాదాపు అన్ని పనులను పూర్తిచేసినట్టు అధికారులు రికార్డుల్లో చూపించి సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా చెల్లించేశారు. అయితే పార్కులో చూస్తే ఒక్క ప్రహరీ గోడ తప్పితే వాటర్ ఫౌంటెయిన్ గానీ, స్టేజీ గానీ, వాకింగ్ ట్రాక్ కానీ, గ్యాలరీ గానీ ఏదీ కనిపించదు. పార్కులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి ఉన్నాయి. అధికారులు రూ.1.6 కోట్లతో పనులు చేపడితే అవన్నీ ఏమైపోయాయో ఇంజనీరింగ్ అధికారులే చెప్పాలి. దీనిపై చీఫ్ ఇంజనీర్ పల్లంరాజును వివరణ కోరగా...తనకు ఆ పనుల గురించి తెలియదని, ఫైల్ తెప్పించుకుని పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తానని సమాధానం ఇచ్చారు.

'ప్రభుత్వ భూమిని కాపాడండి'



పీజీఆర్‌ఎస్‌లో జేసీ మయూర్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతట్ల ఎంపీటీసీ, సర్పంచ్

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చింతగట్ల గ్రామంలో సర్వేనంబర్ 81.3లో ప్రభుత్వానికి చెందిన కొండ పోరంబోకులో ఐదెకరాల భూమిని కాజేసేందుకు చేసిన ప్రయత్నంపై ఆదివారం 'సర్కార్ భూమికి స్కెచ్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జేసీ మయూర్ అశోక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్పందించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని పెందుర్తి తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దారు, సిబ్బంది చింతగట్ల కొండను పరిశీలించారు. అయితే ఆ స్థలంపై ఫీల్డ్ సర్వే చేయాలని ఒక వ్యక్తి చేసిన దరఖాస్తును రెవెన్యూ రికార్డుల మేరకు పరిశీలించిన తరువాతే సర్వేయర్‌కు ఆదేశాలు ఇవ్వాలి. కానీ తహసీల్దార్ కార్యాలయ అధికారులు వెనుకా ముందు ఆలోచించకుండా సర్వేకు అనుమతించాలని సచివాలయ సర్వేయర్‌ను ఆదేశించారు. దీని వెనుక అధికార పార్టీ నేతకు చెందిన బంధువొకరి ఒత్తిడి ఉందన్న ఆరోపణలున్నాయి. తీరా సర్వే చేశాక ఇచ్చిన నివేదిక మేరకు తన పేరిట ఐదు ఎకరాలను నమోదు చేయాలని దరఖాస్తుదారుడు ఒత్తిడి తీసుకురావడం, అందుకు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో జిల్లా అధికారులు స్పందించి వాస్తవ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం గ్రామ సర్పంచ్ జి.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ నందవరపు అప్పలరాజు, తదితరులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీని కలిసి కొండ పోరంబోకు భూమిని రక్షించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన దిగుమర్తి జయలక్ష్మి అనే మహిళకు దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సర్వే నంబరు 83లో పట్టా ఇచ్చారని పేర్కొన్నారు. అయితే రైవాడ కాలువ, పేదలకు ఇళ్ల కోసం 1996లో జయలక్ష్మికి ఇచ్చిన పట్టాతోపాటు మరికొన్ని పట్టాలను అధికారులు రద్దు చేసి భూమి వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. కాగా జయలక్ష్మి వారసులైన మారుతీకుమార్ తనకు సర్వే నంబరు 81-3లో ఐదెకరాలకు సంబంధించి పట్టా ఉందని పేర్కొంటూ ఇచ్చిన దరఖాస్తు మేరకు సర్వే చేసిన ఎల్‌పీఎంను రెవెన్యూ అధికారులు జారీ చేశారని గుర్తుచేశారు. తక్షణమే ఎల్‌పీఎం రద్దు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

పడకేసిన డయాలసిస్ యూనిట్లు

(3వ పేజీ తరువాయి)

ఎదురవుతున్నాయి. మూడు వారాలుగా మెషీన్లు పనిచేయకపోయినా ఆస్పత్రి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించేందుకు కృషిచేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే తమలాంటి వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని రామారావు అనే రోగి సహాయకుడు పేర్కొన్నారు. ఉదయం నుంచి డయాలసిస్ కోసం నిరీక్షిస్తున్నామని, ఇంకా సమయం పడుతుందని చెబుతున్నారని వెల్లడించాడు.

కొత్తవి కొనుగోలు అవసరం

ఇకపోతే, పాడైన ఐదు మెషీన్లలో మూడు పూర్తిగా పనిచేయని స్థితికి చేరినట్టు తెలిసింది. మిగిలిన మెషీన్లు కూడా ఏళ్ల తరబడి నుంచి సేవలు అందిస్తున్నవి కావడంతో ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి.దీనివల్ల రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త డయాలసిస్ మెషీన్లు కొనుగోలు చేయడం ఒక్కటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని వైద్యులు సూచిస్తున్నారు.

చెలరేగిపోతున్న భూ కబ్జాదారులు

(3వ పేజీ తరువాయి)

ఉన్నాయని ఆ నియోజకవర్గంలోని గ్రామాల నుంచి కొందరు సమాచారం అందించారు. నరవ గ్రామంలోని సర్వే నంబర్ 36లో ప్రభుత్వ గెడ్డవాగు సుమారు 1.7 ఎకరాలు ఉంది. దీనిని రెవెన్యూ రికార్డుల్లో గెడ్డగా క్లాసిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఖాతా నంబరు 20001202. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గెడ్డవాగుల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వకూడదు. నిర్మాణాలు చేయకూడదు. కానీ గ్రామానికి చెందిన కొందరు కొద్దికొద్దిగా ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించి, ఒక్కొక్కటి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ గెడ్డ అని తెలియక కొనుగోలుచేసినవారు లబోదిబోమంటున్నారు. గెడ్డవాగులో నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. గవర జగ్గరాజుపాలెంలో గ్రామానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠాన్ని కొందరు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మిస్తున్నారు. జీవీఎంసీ ప్రణాళికా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ సిబ్బంది కొద్దిరోజుల క్రితం వచ్చి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటికి తూతూమంత్రంగా నాలుగు సిమెంటు పలకలు తొలగించి వెళ్లిపోయారు. అక్కడ కూడా ఇళ్లు నిర్మించి రూ.20 లక్షలకు అమ్ముకుంటున్నారు. వీరికి కూటమి నేతలు వత్తాసుపలుకుతున్నారు. సత్తివానిపాలెంలో లక్ష్మీసాగరం చెరువు కబ్జాకు ప్రయత్నిస్తున్నా ఎవరూ అడ్డుకోకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చినముషిడివాడ, పెందుర్తి, కోటనరవ...ప్రతిచోట ప్రభుత్వ సెలవు రోజులు వస్తే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

పోర్టుల్లో డిజిటల్ ఆపరేషన్లు

(3వ పేజీ తరువాయి)

మారుతున్నాయన్నారు. సరకు రవాణాదారులకు నిబంధనల సరళీకరణ, కస్టమ్స్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సముద్ర తీర ప్రాంతం కలిగిన దేశాలన్నీ పోర్టు ఆధారిత అభివృద్ధిని కోరుకుంటున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ గొప్ప సహకారం అందిస్తున్నదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీర ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తున్నారని ప్రశంసించారు. జల రవాణాలో అనేక సవాళ్లు ఉన్నాయని, విశాఖలో నిర్వహిస్తున్న సదస్సులో వాటిపై చర్చ జరుగుతుందన్నారు. వివిధ దేశాల నుంచి 26 మంది ప్రతినిధులు హాజరయ్యారని, మారిటైమ్ వ్యాపారంపై చర్చలు జరుగుతాయన్నారు. భవిష్యత్తులో క్రూయిజ్ పర్యాటకం విశేష ప్రాచుర్యం పొందుతుందన్నారు. పోర్టులు, జల రవాణా శాఖ సెక్రటరీ రామచంద్రన్ మాట్లాడుతూ, పోర్టులు, హార్బర్ల మధ్య కనెక్టివిటీ పెంచడానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని చెప్పారు. పోర్టులు సరకు రవాణా సామర్థ్యం పెంచుకోవలసి ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటివి ఉపయోగించుకుంటూ పోర్టులను ఆటోమేషన్ దిశగా నడిపించాల్సి ఉందన్నారు.

ప్రతి నెల క్రూయిజ్ షిప్

విశాఖపట్నం నుంచి ప్రతి నెల క్రూయిజ్ షిప్ నడిచేలా చర్యలు చేపడుతున్నామని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. బంగాళాఖాతం మిగిలిన సముద్రల్లా నిలకడగా ఉండదని, కొంత అలజడిగా ఉంటుందని, కార్గో నౌకలు నడిపినట్టు పర్యాటక నౌకలను నడపలేరని వివరించారు. ఏదేమైనా విశాఖపట్నం క్రూయిజ్ టెర్మినల్ నుంచి మొదలై ఇతర ప్రాంతాలకు వెళ్లేలా విహార నౌకలను తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖ సహాయ మంత్రి శాంతన్ ఠాకూర్, పోర్టు ఛైర్మన్ అంగముత్తు పాల్గొన్నారు.

పోర్టులో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు

- పోర్టు ఏరియాలో రూ.33.49 కోట్లతో బి-ర్యాంప్ నిర్మాణం
- ఫిషింగ్ హార్బర్‌లో రూ.32.61 కోట్లతో ఫింగర్ జెట్టీ, విఫ్ నిర్మాణం
- ఓఎస్‌టీటీ వద్ద రూ.20.87 కోట్లతో అదనపు బ్రీస్టింగ్ డాల్ఫిన్ల నిర్మాణం
- క్రూయిజ్ టెర్మినల్ వద్ద రూ.15.9 కోట్లతో ప్రజా ప్రొమెనేడ్ అభివృద్ధి
- అంబేడ్కర్ శతాబ్ది ఫ్లైఓవర్ నుంచి రూ.8.31 కోట్లతో అదనపు ర్యాంప్
- పోర్టు ఏరియాలో రూ.5.5 కోట్లతో 15 శౌచాలయాల నిర్మాణం

ప్రారంభించిన ప్రాజెక్టులు

- నూతన ఆయిల్ రిఫైనరీ బెర్త్-2 - రూ.42 కోట్లు
- ఓఎస్‌టీటీ వద్ద ఫైర్ ఫైటింగ్ సదుపాయాలు రూ.27 కోట్లు
- ఆర్-10 ప్రాంతంలో కవర్డ్ స్టోరేజీ షెడ్ రూ.22.5 కోట్లు
- డబ్ల్యూక్యూ జంక్షన్ నుంచి ఎస్సార్ జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణం - రూ.19.69 కోట్లు
- కస్టమ్స్ ప్రహరీ నిర్మాణం - రూ.7.17 కోట్లు
- ఆర్‌ఎఫ్‌ఐడీ గేట్ మేనేజ్‌మెంట్ - రూ.15 కోట్లు
- నూతన పోర్టు ఆపరేటింగ్ సిస్టమ్ - రూ.10.77 కోట్లు
- వెసల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ - రూ.15.83 కోట్లు

గాజువాక తహశీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం


బి. శ్రీనివాస్

గాజువాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గాజువాక తహశీల్దార్‌గా బి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన టి.శ్రీవ ల్లి బదిలీ అవడంతో ఇప్పటి వరకూ డీటీగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌కు తహశీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి ఆయన పలు వినతులు స్వీకరించి, వాటి ప రిష్కరించాలని అధికారులను సూచించారు.

కన్నెలమ్మకు ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెంటమాంబ ఆలయం ఆవరణలోని కన్నెలమ్మ, ఎదురునరుసులు అమ్మవార్లకు నెల్లిముక్కు పంచాయతీకి చెందిన 14 గ్రామాల పెద్దలు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రతి ఏడాది అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేసినట్టు స్థానికులు చెప్పారు. నెల్లిముక్కు, సిద్ధేశ్వరం, బాలచెరువు, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, సీతానగరం, దుర్గవానిపాలెం, కోరాడ, శీకువానిపాలెం, తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు

మల్కాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞాన్ టాలెంట్ స్కూల్‌లో జరిగిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ అవార్డు కార్యక్రమం జర్మినీ మాస్టర్ శ్రీను ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కరాటే సంస్థ వైస్ చైర్మన్ పొట్టిమూర్తిని జనసేన నాయకుడు ముక్క శ్రీను, విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ బ్రహ్మరెడ్డి, చైర్మన్ శ్రీనివాస్ సత్కరించారు.

సీపీఎం పాదయాత్ర

మల్కాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకురాలు మమత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు పెడుతూ ప్రజలపై విద్యుత్ భారాన్ని పెంచనున్నదని అన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లను మంత్రి లోకేశ్ వ్యతిరేకించారని ఇప్పుడు ఆయన మద్దతు పలకడం దారుణమని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పలు కాలనీల్లో బోర్‌వెల్స్ ప్రారంభం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డులో దాదాపు రూ.కోటి ఖర్చుతో పలు కాలనీల్లో బోరు పనులను మాజీ డిప్యూటీ మేయర్ బియ్యాని శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరీనగర్ రిక్షకాలనీలో దాదాపు 120 కుటుంబాలు లబ్ధిపొందుతాయని అన్నారు. ఇదేవిధంగా లలితా డిలైట్ పార్క్, వనితా వాకింగ్ ట్రాక్, నవ్యాంధ్ర స్కూల్ వాకింగ్, గౌతమ బుద్ధ ధ్యానవనం, కరాన హిందూ ముస్లిమ్ పార్కులో బోరు పనులు ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 32, పచ్చిమిర్చి 68, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు


ఏడాది పాలన విజయాలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్, గండి బాబ్జీ

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

» సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, గండి బాబ్జీ

అగనంపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సుపరిపాలని అందుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 79వ వార్డులో గల్లవానిపాలెం వేపచెట్టు కూడలిలో సుపరిపాలనలో ఏడాది కార్యక్రమాన్ని మే యర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఏడాదిగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. అనం తరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. మేయరు పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ అన్ని వార్డులను ప్రణాళికంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అక్కిరెడ్డిపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం 68వ వార్డు కాళికనగర్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కూటమి పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పులవురు నాయకులు పాల్గొన్నారు.

ఇప్పుడిప్పుడే గాడిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

వేపగుంట (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డులో ముత్యమాంబకాలనీలో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన ఐదు సంవత్సరాల్లో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం సరిచేస్తూ ప్రజలు సంక్షేమం కోసం పనిచేస్తోందని అన్నారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనకు ప్రజల మన్నన

శ్రీనగర్ (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో విజయవంతంగా పలు పథకాలను అమలు చేసి ప్రజలు మన్ననలు పొందిందని రాష్ట్ర టీడీపీ పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు జీవీఎంసీ 71 వార్డు గురునాథరావు కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రచారం నిర్వహించి ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేశానికే దిక్సూచి చంద్రబాబు నాయుడు

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): దేశానికే దిక్సూచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని 86 వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్య నారాయణ అన్నారు. జీవీఎంసీ 86 వార్డు సాయిరాం నగర్‌లో సోమవారం సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఒక్కసారిగా పింఛను పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. ప్రజలు మెచ్చిన పాలన అందించడం చంద్రబాబుకే దక్కుతుందని 70 వార్డు టీడీపీ పరిశీలకుడు కోగంటి లెనిన్ బాబు అన్నారు. జీవీఎంసీ 70 వార్డు ఎల్‌వి నగర్‌లో సోమవారం సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం ప్రజలకు చేసిన పథకాలను వివరించారు

సమర్థవంతంగా సేవలు అందించిన వారికి గుర్తింపు


డాక్టర్ రమేశ్‌బాబును సత్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): సమర్థవంతంగా సేవలందించిన ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బదిలీపై వెళ్తున్న పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేశ్ బాబును ఆరోగ్యకేంద్ర సిబ్బంది, స్థానిక నాయకులు సోమవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యవృత్తిలో ఉన్నవారిని కనిపించే దేవునిగా ప్రజలు నమ్ముతారని అన్నారు. మంచి సేవలు అందించిన వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. నూతన వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సంపత్ నిత్యం రోగులకు అందుబాటులో ఉండి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జీవీఎంసీ 75వవార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి అధ్యక్షత వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన వైద్యాధికారి డాక్టర్ సంపత్, వైద్యాధికారి-2 డాక్టర్ పైడి హేమలత, గాజువాక నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సత్తాచాటిన చిన్నారులు


చిన్నారులను అభినందిస్తున్న కార్పొరేటర్ సురేశ్

మల్కాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వరావు నిర్వహించిన డీఆర్ఎమ్ కప్ ఆంధ్రసబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ చాంపియన్ 2025 పోటీల్లో మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ చిన్నారులు సత్తా చాటారు. మహిళల 37-40 కేజీల విభాగంలో బి.షర్మిల రజత పతకం సొంతం చేసుకోగా, పురుషుల 33-35 విభాగంలో ఎన్.హర్షిత్ రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా శ్రీహరిపురం జీవీఎంసీ వాకర్స్ మైదానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉత్తమ బాక్సర్లుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైక్ టైసన్ బాక్సింగ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

వీవీవీ స్కూల్‌ను తక్షణమే ప్రారంభించాలి

» 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయంలో తరగతులు తక్షణమే ప్రారంభించాలని, లేని పక్షంలో బుధవారం నుంచి స్కూల్ ఎదుట నిరసన దీక్షలు చేస్తామని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా, వీవీవీలో నేటి వరకు తరగుతులు ప్రారంభం కాలేదని,దీంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించాలని అన్నారు. పాఠశాల విషయంలో ఎంతటి పోరాటాలకైనా సిద్ధమన్నారు.

23 నుంచి ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

» దరఖాస్తులగడువు జూలై 20

కంచరపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గల వివిధ ప్రభుత్వ/ ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడతలో మిగులు సీట్లకు ఈ నెల 23 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ఐటీఐల కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు అభ్యర్థులు ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను సమీపంలోని ఐటీఐల్లో తనిఖీ చేయించుకోవడానికి ఈ నెల 22 వరకు అవకాశం ఉందన్నారు. జూలై 23 నుంచి 25 వరకు జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రైవేటు ఐటీఐల్లో సీట్లకు 26, 27తేదీల్లో కౌన్సెలింగ్ జరగనున్నది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని శ్రీకాంత్ సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన జరగని అభ్యర్థుల పేర్లు మెరిట్ లిస్టులో సూచించబోమని స్పష్టంచేశారు.

'తల్లికి వందనం' కోసం అకౌంట్లు ఓపెన్ చేసుకోవాలి

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో భాగంగా రెండో విడత కింద ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నిధులు జమ చేయనున్నదని, ఇందుకోసం లబ్ధిదారులు బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు ఒక ప్రకటనలో కోరారు. షెడ్యూల్ కులాలకు చెందిన ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులైతే తల్లి పేరిట, ఇంటర్ చదువుతున్న విద్యార్థులైతే తమ పేరిట బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. ఈ రెండు కేటగిరీలకు చెందిన వాళ్ల సమీపంలోని పోస్టాఫీసు లేదా బ్యాంకులో ఈ నెల 16వ తేదీలోగా అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసుకున్నవాళ్లు ఆధార్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని సూచించారు.

సోలార్ రూఫ్ టాప్‌లపై వినియోగదారులకు అవగాహన

ఆటోనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలంటే ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో చేరాలని, సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఏడీసీ పార్థసారథి, ఏఈ రాయుడు రామకృష్ణ అన్నారు. జీవీఎంసీ 70 వార్డు శ్రీనివాస నగర్ ట్వింకిల్ స్కూల్‌లో సోమవారం సోలార్ రూఫ్ టాప్ పై నిర్వహించిన సర్వేల్లో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు కరెంటు బిల్లు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వినియోగదారులకు లబ్ధి చేస్తుందన్నారు. పెట్టుబడుల కోసం ఎటువంటి పూచీ కత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణం తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. సౌర విద్యుత్ వల్ల కలిగా ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలి

» భారతీయులు ఎందులోనూ తక్కువ కాదు

» గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి వెంకట్రావు


ప్రొఫెసర్ వెంకటరావును సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులు ప్రతీ సబ్జెక్టుపైనా పట్టు సాధించాలని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు పేర్కొన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో మూడు సంవత్సరాలు, ఐదు సంత్సరాల లా కోర్సుల్లో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వినగలిగినప్పుడే తమను తాము పరీక్షించుకుంటూ ఎదగవచ్చన్నారు. న్యాయ విద్యార్థులు నిపుణులతో అవగాహన పెంచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. భారతీయులు ప్రపంచంలో ఏ ఒక్కరికీ తక్కువ కాదన్నారు. నేటి యువత మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తిఆయన సూచించారు. వర్సిటీలో ఉన్న అనేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వర్సిటీలో సౌకర్యాలు, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ న్యాయ విద్యార్థికి సమాజం పట్ల పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టాలను సరిగా అర్థం చేసుకోగలరన్నారు. అనంతరం ప్రొఫెసర్ వెంకటరావును వీసీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధే నా లక్ష్యం

» కార్పొరేటర్ బొండా జగన్

కూర్మన్నపాలెం,జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని 87 వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. కణితి యాదవ వీధిలో సోమవారం సామాజిక భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.

పీజీఆర్ఎస్‌కు 11 ఫిర్యాదులు

వేపగుంట.జూలై 14(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా జీవీఎంసీ 89వ వార్డు సంతోశ్‌నగర్ సెల్ టవర్ సమస్య పరిష్కరించాలని, 91, 92 వార్డుల్లో అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, 95 వ వార్డు చిమలాపల్లిలో పందులు సమస్య పరిష్కరించాలని, లక్ష్మీపురంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని, జ్యోతినగర్‌లో రోడ్డు సమస్య పరిష్కారం చేయాలని, 97వ వార్డు చినముషిలవాడలో కార్ పార్కింగ్ సమస్యపరిష్కారం చేయాలని తదితర ఫిర్యాదులు అందాయి.


ఆర్‌పీలకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

» ఆర్‌పీలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచన

గాజువాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని దీనికోసం ఆర్‌పీలు కృషి చేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం ఆర్‌పీలకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి మహిళల ఆర్థిక ప్రగతిని పెంచిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని అన్నారు. ఈ విధానాన్ని ప్రపంచ దేశాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసే విషయంలో ఆర్‌పీలు కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ దల్లి గోవిందరెడ్డి, జోనల్ కమిషనర్ శేషాద్రి, పలువురు కార్పొరేటరు, పలువురు నాయకులు పాల్గొన్నారు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గిరిధర్


గిరిధర్‌కు కండువాకప్పి సంఘంలోకి ఆహ్వానిస్తున్న ఆర్ కృష్ణయ్య

విశాఖపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా నల్లాన వెంకటకృష్ణ గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పై నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకాలమ్మ చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య కండువా కప్పి గిరిధర్‌ను బీసీ ఉద్యమంలోకి ఆహ్వానిస్తూ బీసీల హక్కుల పరిరక్షణకోసం, వారికి రాజ్యాధికారం దక్కేవరకు ఎల్లవేళలా ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ జాతీయ బీసీ సంఘం లక్ష్యాల మేరకు బీసీల హక్కుల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. హైదరాబాదులో ఆర్ కృష్ణయ్య కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేశ్ తదితర నాలయకులు పల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తగదు : ఏఐటీయూసీ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను వీడాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ అన్నారు. యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత నిరుద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టౌన్‌షిప్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఇప్పటి వరకు ఉపాధి కల్పించలేదన్నారు. ఇటీవల కాలంలో నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం తొలగించిందని అన్నారు. ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నిర్వాసినత సంఘం నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

» ట్రాఫిక్ సీఐ కె. వెంకట్రావు

కూర్మన్నపాలెం,జూలై 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం మీద వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె. వెంకట్రావు అన్నారు. స్టీల్ ప్లాంట్ రోడ్డులో సోమవారం ద్విచక్ర వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. సీపీ ఆదేశాల మేఉరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమాన విధించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి వాహన దారులకు అవగాహన కల్పిస్తామన్నారు. లేన్ అండ్ డిసిప్లేన్ విధానాన్ని తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూని ప్రభుత్వమే నడపాలి'

మల్కాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యూ)ను ప్రభుత్వమే నడపాలని కోరుతూ సీపీఎం నాయకులు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ఆర్‌యూను వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, 24 గంటలూ వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆధునిక వైద్యం అందించాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రాడార్ స్టేషన్‌ను సందర్శించిన విజ్ఞాన్ విద్యార్థులు

అనంపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం విద్యార్థులు సోమవారం వాతావరణ రాడార్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాడార్ వ్యవస్థ పనితీరు గూరించి అధ్యాపకులు విపులంగా వివరించారు. విద్యార్థులకు వాతావరణ సమాచారం, సాకేంతికతపై మెరుగైన అవగాహన పెంచాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల బృదం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్‌సిటీ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కేఎస్.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జూలై 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, 22న సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఉంటుందని, 23 నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు 1594మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 1122 మంది అభ్యర్థులు తన సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారని, ఇంకా 472 మంది మిగిలి ఉన్నారని అన్నారు. మిగిలిన వారిని ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఆటోనగర్,జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారామే ధ్యేయంగా కృషి చేస్తున్నాననీ 71 వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. వార్డు పరిధి తోకాడలో సోమవారం తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోకాడలో రోడ్లు, కాలువల సమస్యలు తన దృష్టికి వచ్చాయని అన్నారు. వీటిని ఎమ్మెల్యే పల్లా, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా 88 వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో సోమవారం 3 బోర్లను కార్పొరేటర్లు ముత్యాలు నాయుడు ప్రారంభించారు.

'కార్యకర్తలే టీడీపీకి పునాది'

పెదగంట్యాడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి పునాదులని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, 76వవార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ నూతన వార్డు సభ్యులు సోమవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ఆది నుంచి కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను నాయకులుగా తీర్చి దిద్దుతోందన్నారు. ఎప్పటికప్పుడు కొత్తవారికి బాధ్యతలు అప్పగించడం వల్ల పార్టీలో కొత్తఊపు వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యానికి మెరుగులు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ప్రభుత్వ రంగ సంస్థలకు సూచించింది. దీనిలో భాగంగానే హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ద్వారకా కాంప్లెక్సులోని ఐదు అంతస్తుల భవనంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని 2016 మేలో ఏర్పాటు చేసింది. సంస్థ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ భాగం దీనికి వినియోగిస్తోంది. అప్పటి నుంచి వేలాదిమంది యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చి వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి కల్పించింది. ఇప్పటి వరకు 23 వేల మంది నైపుణ్య శిక్షణ పొందారు. ఇందులో 78 శాతం మంది 150కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. శిక్షణ పొందిన వారిలో 22 శాతం మంది మహిళలున్నారు.

జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ ఉంటుంది. వ్యక్తిత్వ అభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, నగదు నిర్వహణ, ఇంటర్వ్యూ సంసిద్ధత, ఉపాధి శిక్షణలో ఇస్తున్నారు. ప్రయోగశాల, బోధనా సహాయాలు, వినియోగ వస్తువులు, ముడిపదార్థాలు సంస్థ సమకూరుస్తుంది. ట్రైనీల కోసం ఇండక్షన్ కిట్, టోట్ సర్టిఫికేషన్ కలిగిన ట్రైనర్లతో శిక్షణ ఇస్తున్నారు.ఏసీ తరగతిగదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సోలార్ హీటర్లు, 160 సీటింగ్ కెపాసిటీ కలిగిన ఆడిటోరియం, లైబ్రరీ, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉన్నాయి.

హెచ్‌పీసీఎల్‌లో ఉచిత శిక్షణ

» నిరుద్యోగుల ఉపాధికి ఊతం



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



ఇండస్ట్రియల్ వెల్డర్

అందిస్తున్న కోర్సులు

ప్లంబర్ (జనరల్), ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్, రిటైల్ అవుట్‌లెట్ అటెండెంట్, ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్, ప్యాకింగ్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, రిటైల్ సేల్స్ అసోసియేట్, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్, ఎల్‌పీజీ మెకానిక్, మల్టీఫంక్షనల్ అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, మెయింటినెన్స్, మెకానికల్, ఫిట్టింగ్ అసిస్టెంట్, ఫ్యాబ్రికేషన్ ఫిట్టర్, ఇండస్ట్రియల్ వెల్డర్, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డర్, పైపు ఫిట్టర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్యూటీషియన్, ఫుడ్, బేవరేజస్ అసోసియేట్ వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు.

అర్హత, సౌకర్యాలు

హెచ్‌పీసీఎల్ నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ, ఉపాధి పొందేందుకు 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయసువారు అర్హులు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారికి నైపుణ్యం పెంచేందుకు, ఉపాధి కల్పించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చేరిన వారికి ఉచిత శిక్షణ, వసతి భోజన సదుపాయం కల్పిస్తుంది. అధ్యయన సామగ్రి కూడా ఉచితంగానే అందిస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఐఎన్‌ఓ గుర్తింపు కలిగిన ధ్రువపత్రాలు అందజేస్తారు.

సాధించిన అవార్డులు

స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఇప్పటి వరకు పలు అవార్డులు సాధించింది. అస్సోచాం స్కిల్ అచీవర్స్ అవార్డును వరుసగా మూడుసార్లు సాధించింది. కమ్యూనిటీ ఇంపాక్ట్‌లో ఎక్సలెన్స్‌కు ఎస్‌హెచ్ఆర్ఎం అవార్డు సాధించింది. గ్రీన్‌టెక్ ఫౌండేషన్ నుంచి సీఎస్ఆర్ ఇండియా అవార్డును వరుసగా మూడుసార్లు సాధించింది. గ్రోకేర్ ఇండియా సీఎస్ఆర్ ఎక్సలెన్స్ నుంచి ప్లాటినం అవార్డు పొందింది.

నైపుణ్యాన్ని జోడిస్తున్నాం



యువతలో నైపుణ్యాన్ని వెలికితీసి దానికి మరింత పదును పెడుతున్నాం. యువత అర్హత, ఆసక్తిని గుర్తించి అందుకు అనుగుణంగా వారికి ఉచితంగానే శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కాలంలో విద్యార్థులకు భోజన వసతి, అధ్యయన సామగ్రిని సంస్థే సమకూరుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాం. దేశానికి నైపుణ్యం కలిగిన యువతను అందిస్తున్నామన్న సంతృప్తి పొందుతున్నాం.

- ఇంతియాజ్ అర్షద్, సీఈఓ, స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్

నచ్చిన రంగంలో శిక్షణ, ఉపాధి



నిరుద్యోగ యుతకు నచ్చిన రంగాల్లో స్కిల్‌డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నాం. ఫుడ్ అండ్ బేవరేజస్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాం.

-సీహెచ్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బొల్లినేని మెడ్‌స్కిల్స్



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో తరగతులు



హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు

నేడు మంత్రి చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం నగర పర్యటనలో భాగంగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని కేంద్రం అప్‌గ్రేడ్ చేయడం ద్వారా నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాలను ప్రారంభించనున్నారు. 11.15 గంటలకు పెదవాల్తేరులో పీహెచ్‌సీని, 12.30 జీఐఎంఎస్ఆర్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్, ఆధునిక ఆపరేషన్ థియేటర్‌ను ఆయన ప్రారంభిస్తారు.

అర్జీదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించండి

» అధికారులకు కలెక్టర్ ఆదేశం

» ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 348 దరఖాస్తులు

మహారాణిపేట, జూలై14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే దరఖాస్తుల విషయంలో సంబంధిత అధికారి లేదా ఉద్యోగి అర్జీదారునితో ఫోన్‌లో లేదా నేరుగా వెళ్లి మాట్లాడి వారు సంతృప్తిచెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అర్జీదారులతో మాట్లాడిందీ, లేనిదీ తానే నేరుగా బుధ, గురువారాల్లో వారికి ఫోన్ చేసి తెలుసుకుంటానన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సహా జిల్లాస్థాయి అధికారులు 348 అర్జీలు స్వీకరించారు. ఇందులో రెవెన్యూకు 122, జీవీఎంసీ 76, పోలీసు శాఖకు 14, ఇతర విభాగాల నుంచి 136 ఫిర్యాదులు అందాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ విషయమై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య తెలుసుకుని కాలపరిమితిలోగా పరిష్కరించాలని ఆదేశించారు . ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

ఆనందపురం మండలం దబ్బందలో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట టిడ్కో దబ్బంద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వీధి దీపాలు, రోడ్డు, తాగునీరు, వైద్యం, పార్కు, ఆట స్థలం, షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని కోరారు.

పోలీసు కమిషనరేట్‌లో 98 ఫిర్యాదులు

పోలీసు కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 98 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, అధికారులు ఫిర్యాదులు స్వీకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడి చట్టపరంగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

అపార్ట్‌మెంట్లలో కామన్ సర్వీసులకు సోలార్ పవర్ తప్పనిసరి

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపార్ట్‌మెంట్లలో కామన్ సర్వీసులకు తప్పనిసరిగా సోలార్ పవర్ వాడేలా చూడాలని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ సూచించారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన పెంచి ఎక్కువ ప్లాంట్లు పెట్టించేందుకు ఆయన విశాఖపట్నం సర్కిల్ కార్యాలయంలో అధికారులు, వెండర్లు, బ్యాంకుల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులు, గ్రామ పంచాయతీలలో రూఫ్ టాప్ సోలార్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం సోలార్ వెండర్లతో అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. విశాఖలో 200 కంటే ఎక్కువ యూనిట్లు వినియోగించేవారు 1.83 లక్షల మంది ఉన్నారని, అయితే ఇప్పటివరకు కేవలం 2,200 సోలార్ ప్లాంట్లే ఏర్పాటయ్యాయని, పురోగతి సాధించాలన్నారు. సిరిపురం, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, మద్రిపాలెం, కంచరపాలెం, ఎన్ఎస్‌టీఎల్, మధురవాడ, ఎండాడ, గోపాలపట్నం, గాజువాకల్లో సామర్థ్యానికి తగిన విధంగా సోలార్ ప్లాంట్లు పెట్టించడం లేదన్నారు. అతి తక్కువ వడ్డీతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వీటిని ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆపరేషన్ల డైరెక్టర్ సూర్యప్రకాశ్, సీజీఎం సులేఖారాణి, ఎస్ఈ శ్యాంబాబు, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీజీవీబీ ఆర్ఎం చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పృథ్వీతేజ

రైళ్లు పాక్షికంగా రద్దు...గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల వల్ల ఈ నెల 16 వరకు కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు కొరాపుట్ వరకే నడిపిస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) మంగళవారం విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 15, 16 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కొరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈ నెల 15, 16 తేదీల్లో విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో పాసింజర్ (58502) 15, 16 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కొరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18005) మంగళవారం హౌరాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18006) ఈ నెల 16, 17 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరి హౌరా చేరుతుంది. కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య ఈ రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. రౌర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18107) మంగళవారం రౌర్కెలాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే ఇంటర్‌సిటీ (18108) ఈ నెల 15, 16 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరి రౌర్కెలా చేరుతుంది. వీటిని కూడా కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రద్దు చేశారు. భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18447) మంగళవారం భువనేశ్వర్‌లో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18448) ఈ నెల 15, 16 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరి భువనేశ్వర్ చేరుతుంది. కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలను రద్దు చేసినట్లు డీసీఎం పేర్కొన్నారు.

ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేయాలి

» రాష్ట్ర ఎస్టీ కమిషనర్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలు, విశ్వవిద్యాలయాలతోపాటు ప్రైవేటు సంస్థల్లో నియామకాలు చేపట్టేటప్పుడు ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఏయూ ఎస్టీ ఉద్యోగుల సంఘ సభ్యులతో సోమవారం ఉదయం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగుల రోస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏయూలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాల్లో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పకుండా పాటించాలన్నారు. ఎస్టీ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలన్నారు. అనంతరం ఆయన ఎస్టీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అంబేడ్కర్ చెప్పినట్టు విద్యను ఒక ఆయుధంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, నోడల్ ఆఫీసర్ జె.అప్పారావు, ఏయూ ఉద్యోగుల లైజన్ అధికారి కెనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శంకరరావును సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, తదితరులు

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



మృతుడు కిశోర్ (ఫైల్ ఫొటో)

ఆనందపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని వేములవలస జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి దుర్మరణం చెందారు. ఇందుకు సంబంధించి సీఐ చింతావాసు నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గంభీరం పంచాయతీ పరిధిలోని దుక్కవానిపాలేనికి చెందిన సత్యాల కిశోర్ (25) జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగంలో పని చేస్తున్నారు. అతడు సోమవారం తెల్లవారు జామున తన ఆటోపై డ్యూటీకి బయలుదేరగా.. వేములవలస జంక్షన్‌కు జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ఎదురుగా ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సత్యాల కిశోర్ (25)కు బలమైన గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయింది. మృతుడి తండ్రి శివ కూలి పనులు చేసుకుంటుండగా, తల్లి అప్పలకొండ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తుంటారు. కిశోర్‌కు రెండేళ్ల క్రితం విజయవాడకు చెందిన అమ్మాయితో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. తండ్రి శివ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు కిశోర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో దాడి: యువకుడి మృతి



మృతి చెందిన ఎల్లాజీ

మహారాణిపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన యువకుల మధ్య గొడవ కారణంగా కత్తి దాడికి గురైన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో డాబాగార్డెన్స్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిందని చెబుతున్న పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శెట్టి ఎల్లాజీ (21) అనే యువకుడు స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా చేసేవాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఎల్లాజీ , మరికొందరితో కలసి మద్యం తాగాడు. అనంతరం వీరి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ గొడవలో ఎల్లాజీపై వారు కత్తితో దాడికి పాల్పడ్డారు. విషయం పోలీసులకు తెలియటంతో టూటౌన్ ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ఎల్లాజీని కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఎల్లాజీ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన అయ్యప్ప, మరో ఇద్దరు పరారు కావటంతో పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. ఎస్ఐ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్ బయట ఉన్న ఆటో స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడని సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నేరుగా లేదా సీఐ 94407 96012 ఫోను నెంబర్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

21 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన హర్షిత్ మిశ్రా రూ.59 వేల విలువైన 11.8 కిలోల గంజాయి సంచులను ఢిల్లీకి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. అలాగే ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్మోల్ మిశ్రా రూ.48 వేల విలువైన 9.6 కిలోల గంజాయి సంచులతో పట్టుబడ్డాడు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై దుష్ప్రచారం

» ఎక్స్‌లో ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ పోస్టులు

» సీఐ తిరుమలరావుకు జనసేన శ్రేణుల ఫిర్యాదు

» నిందితుడి ఫొటో ప్రదర్శిస్తూ స్టేషన్ ఎదుట ఆందోళన

» కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్



మార్ఫింగ్ వీడియో ప్రచారం చేస్తున్న వ్యక్తిగా పేర్కొంటూ అతడి ఫొటో ప్రదర్శిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గౌరవానికి భంగం కలిగేలా సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పోలీసుస్టేషన్‌కు ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సీఐ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ తగరపువలసకు చెందిన ఒక వ్యక్తి లోలాకుల చార్యులు అనే తప్పుడు ఎక్స్ (ట్విటర్) అకౌంట్‌లో పవన్‌కల్యాణ్‌పై తప్పుడు పోస్టులు పెడుతున్నట్టు గుర్తించామన్నారు. ఇతడు గతంలో ఒక కేసు విషయంలో రిమాండ్‌లో ఉండి ఇటీవలే బయటకు వచ్చాడని తెలుస్తోందన్నారు. ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ అకౌంట్ నుంచి మార్ఫింగ్ చేసిన వీడియోలు, మార్పు చేసిన ఫొటోలతో పవన్ కల్యాణ్ హోదా, గౌరవానికి భంగం వాటిల్లే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. అసలు గత ఫిబ్రవరి నుంచే రాష్ట్రంలో పలు చోట్ల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తప్పుడు ఫేస్‌బుక్, తప్పుడు ఎక్స్ అకౌంట్‌లు, వాట్సాప్ గ్రూలు క్రియేట్ చేసి దుష్ప్రచారానికి తెగబడుతున్నారని ఆరోపించారు. జనసేన కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్నారన్నారు. అంతేకాక రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. శ్రీకాళహస్తిలో జనసేన ఇన్‌చార్జిగా ఉన్న మహిళా నాయకురాలు డ్రైవర్ హత్య జరిగితే ఈ సంఘటనపై చెన్నైలో దర్యాప్తు జరుగుతోందన్నారు. అయితే, ఈ హత్య వెనుక పవన్ కల్యాణ్ ఉన్నాడంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటువంటి వ్యక్తులపై తక్షణం సమగ్ర దర్యాప్తు జరిపి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం, పోలీసు స్టేషన్ ముందు తప్పుడు పోస్టులు పెడుతున్న వ్యక్తి ఫోటోలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అక్కరమాని దివాకర్, కృష్ణయ్య, ఎస్.శ్రీనివాసరావు, భువనేశ్వరి, అనిల్, తదితరులు పాల్గొన్నారు

'పీ-4 మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలి'

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 అమలులో భాగంగా 10వేల మంది మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరపసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔత్సాహికులను గుర్తించి జాబితాలను రూపొందించి వారిని బంగారు కుటుంబాలతో అనుసంధానం చేయాలన్నారు. పేదరికంలేని సమాజ నిర్మాణంలో అధికారులు భాగస్వాములు కావాలని పేర్కొంటూ గజిటెడ్ ర్యాంకు కలిగిన అధికారి కనీసం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. కొన్ని రంగాలకు చెందిన నిపుణులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేటప్పుడు వారికి చెందిన రంగానికి సంబంధించి పరిజ్ఞానం అందించి మెరుగైన శిక్షణకు దోహదపడవచ్చునని పేర్కొన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానిశంకర్ పాల్గొన్నారు.